


# వార్త వేకువ

తెలుగు దినపత్రిక

నిజం వైపు నిరంతరం...

PRGI No: TGTEL/26/A2290








ప్రచురణ : రంగారెడ్డి ఎడిటర్ : ఆవనగంటి అనిల్ కుమార్ సంపుటి : 01 సంచిక : 42 వెల : 4 పేజిలు : 08 గురువారం 11 - 06 - 2026


## అమరావతిలో రూ.1235 కోట్లతో

# కేంద్రం భారీ ప్రాజెక్ట్

- ఏపీ రాజధానిలో కీలక పరిణామం..
- అమరావతిలో భారీ ప్రాజెక్టుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల నివాసాల కోసం రూ.1235 కోట్లు కేటాయింపు
- మొత్తం 11 టవర్లలో 1504 నివాస గృహాలు నిర్మించనున్న సీపీడబ్ల్యూడీ
- పర్యావరణ హితంగా, గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలతో నిర్మాణం
- నిర్మాణ, నిర్వహణ దశల్లో స్థానికంగా భారీగా ఉపాధి అవకాశాలు



**వార్త వేకువ , అమరావతి, జూన్ 10 :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అభివృద్ధి పనుల దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ), అమరావతిలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం భారీ నివాస సముదాయాల నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు కోసం రూ. 1,234.91 కోట్లను కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్ట్ వ్యయాన్ని పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే బడ్జెటరీ మద్దతు ద్వారా భరించనుంది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (సీపీడబ్ల్యూడీ) చేపట్టనుంది. ఇప్పటికే - మిగతా 2 లో

## ఏపీలో తక్కువ జనాభా అయినా

# నిధుల్లో టాప్ 3లో ఏపీ

- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
- తక్కువ జనాభా ఉన్నప్పటికీ కేంద్ర నిధుల వాటాలో ఏపీ దేశంలోనే మూడో స్థానంలో ఉందని వెల్లడి
- ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రానికి రూ.7,700 కోట్లు అందాయన్న కేంద్ర మంత్రి
- అమరావతిలో కేంద్ర ప్రభుత్వ భవనాల నిర్మాణం మూడేళ్లలో పూర్తవుతుందని వెల్లడి



**వార్త వేకువ , అమరావతి, జూన్ 10 :** తక్కువ జనాభా ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు పొందుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో నిలిచిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో - మిగతా 2 లో

# 24 గంటల్లోనే చెప్పిన మాట నిలబెట్టుకున్న మంత్రి లోకేశ్

- విశాఖ స్టీల్‌ప్లాంట్ మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున చెక్కులు అందించిన మంత్రి
- ఒక్కో కుటుంబానికి రూ. 1.72 కోట్ల వరకు ప్రయోజనాలు, ఉద్యోగం ఇస్తామన్న పవన్
- ప్రమాద కారణాలపై కేంద్ర ఉక్కుశాఖ త్రిసభ్య కమిటీ విచారణ ప్రారంభం
- రూ. 120 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా



**వార్త వేకువ , అమరావతి, జూన్ 10 :** విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపుతూనే ఉంది. ఈ ఘటనలో మృతుల సంఖ్య 9కి చేరింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పైడిరాజు అనే మరో ఉద్యోగి ఇవాళ ఉదయం ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు ధ్రువీకరించారు. దీంతో ప్లాంట్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. మరోవైపు ప్రభుత్వం ప్రకటించిన సహాయక చర్యలు వేగంగా అమలవుతున్నాయి. మంగళవారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ బాధిత కుటుంబాలను పరామర్శించి, ఇచ్చిన మాట ప్రకారం 24 గంటలు - మిగతా 2 లో

# మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ రద్దు



- మీనాక్షి రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ
- తెలంగాణ కేసు వెల్లడించలేదంటూ వివాదం
- కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం
- చర్చలోకి ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 33ఏ

**వార్త వేకువ , ఢిల్లీ, జూన్ 10 :** కాంగ్రెస్ సీనియర్ నేత మీనాక్షి నటరాజన్ రాజ్యసభ ఎన్నికల నామినేషన్ తిరస్కరణ రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. మధ్యప్రదేశ్ నుంచి దాఖలు చేసిన ఆమె నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించడంతో కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆరోపించింది. తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ఓ కేసు వివరాలను అఫిడవిట్‌లో - మిగతా 2 లో

## భారీ మూల్యం తప్పదన్న డొనాల్డ్



- ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరిక
- 'మిడిల్ ఈస్ట్ రౌడీ చనిపోయాడు' అంటూ ట్రూత్ సోషల్‌లో పోస్ట్
- అమెరికా హెలికాప్టర్ కూల్చివేతతో పెరిగిన ఉద్రిక్తతలు


# ప్రధానిగా నెహ్రూ రికార్డును బ్రేక్ చేసిన నరేంద్రమోదీ

- తెలంగాణ బీజేపీ చీఫ్ స్పందన
- సుదీర్ఘకాలం ఎన్నికైన ప్రధానిగా నెహ్రూ రికార్డును అధిగమించిన మోదీ
- నిరంతరాయంగా 4,399 రోజులు ప్రధానిగా సేవలు
- ఇది చారిత్రక మైలురాయి అంటూ రామచంద్రరావు ప్రశంస
- మోదీ పాలనలో దేశం స్వర్ణయుగాన్ని చూస్తోందన్న రామచంద్రరావు
- ప్రధానికి శుభాకాంక్షలు తెలుపుతూ కేంద్ర కేబినెట్ తీర్మానం



**వార్త వేకువ , ఢిల్లీ, జూన్ 10 :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారత ప్రజాస్వామ్య చరిత్రలో అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. అత్యధిక కాలం నిరంతరాయంగా ప్రధాని పదవిలో కొనసాగిన నేతగా జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న రికార్డును ఆయన అధిగమించారు. నెహ్రూ 4,398 రోజుల పాటు ఈ పదవిలో ఉండగా, మోదీ 4,399 రోజులు పూర్తి చేసుకుని నూతన చరిత్రను లిఖించారు. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని తెలంగాణకు చెందిన బీజేపీ నాయకులు రామచంద్రరావు ప్రధాని మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. ఇది ఒక చారిత్రక మైలురాయి అని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. 140 కోట్ల భారతీయుల ఆకాంక్షలకు, అచంచలమైన నమ్మకానికి మోదీ నిదర్శనమని, ఆయన పదవీకాలం దేశ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయమని కొనియాడారు. నరేంద్ర మోదీ 2014 మే 26న తొలిసారిగా ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం 2019లో రెండోసారి, 2024 జూన్ 9న సంకీర్ణ ప్రభుత్వ సారథిగా మూడోసారి పగ్గాలు చేపట్టారు. మోదీ నాయకత్వంలో పేదరిక నిర్మూలన, మహిళా సాధికారత, ఆర్టికల్ 370 రద్దు, నక్సలిజం అణచివేత, సరిహద్దుల బలోపేతం వంటి కీలక రంగాల్లో దేశం గణనీయమైన పురోగతి సాధించిందని రామచంద్రరావు వివరించారు. మరోవైపు, ప్రధాని మోదీ - మిగతా 2 లో

## 2047 వరకు మోదీయే ప్రధానిగా కొనసాగాలి



- కేంద్ర మంత్రి బండి సంజయ్
- ప్రధానిగా నెహ్రూ రికార్డును మోదీ బద్దలు కొట్టారన్న బండి సంజయ్
- అత్యధిక కాలం ప్రధానిగా మోదీ పేరు లిఖించబడిందని హర్షం
- మీనాక్షి నటరాజన్ వ్యవహారం ఎన్నికల కమిషన్ పరిధిలోనిదని వ్యాఖ్య

**వార్త వేకువ , హైదరాబాద్, జూన్ 10 :** భారత రాజకీయాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సరికొత్త చరిత్ర సృష్టించారని, దేశంలో అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన - మిగతా 2 లో

## ఐటీ ఏరియాలో ఈగల్ ఫోర్స్ భారీ ఆపరేషన్

EAGLE FORCE

ELITE ACTION GROUP FOR DRUG LAW ENFORCEMENT

- పారిపోయిన డ్రగ్‌డాన్ నీతూబాయ్
- నీతూబాయ్ కోసం నానక్‌రామ్‌గూడాలో మకాం వేసిన ఈగల్ ఫోర్స్
- గతంలోనే ఆమెను అరెస్టు చేసి పీడీ యాక్ట్ పెట్టిన పోలీసులు
- జైలు నుంచి వచ్చి మళ్లీ అమ్మకాలు కొనసాగిస్తున్న నీతు

**వార్త వేకువ , హైదరాబాద్, జూన్ 10 :** తెలంగాణ రాష్ట్రంలో డ్రగ్స్ కేసులు కలవర పెడుతున్నాయి. ఈ సమస్యను రూపుమాపేందుకు ఈగల్ ఫోర్స్ శ్రమిస్తోంది. దీనిలో భాగంగానే హైదరాబాద్ ఐటీ ఏరియాలో - మిగతా 2 లో

# 'భారత్ ఫ్యూచర్ సిటీ' కల సాకారమయింది

- ఫ్యూచర్ సిటీ ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించనున్న రేవంత్
- ఇది చరిత్రలో నిలిచిపోయే రోజు అన్న రేవంత్
- ఆధునిక భారతదేశానికి నూతన నగరంగా ఫ్యూచర్ సిటీ నిలవబోతోందని వ్యాఖ్య
- ప్రపంచంలోని గొప్ప నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్న సీఎం
- హైదరాబాద్ ఖ్యాతిని ప్రపంచస్థాయికి తీసుకెళ్లే 'భారత్ ఫ్యూచర్ సిటీ' కల సాకారమయ్యేందుకు తొలి అడుగు



**వార్త వేకువ , హైదరాబాద్, జూన్ 10 :** తెలంగాణ చరిత్రలో ఒక సరికొత్త మైలురాయి లిఖించబడబోతోంది. హైదరాబాద్ ఖ్యాతిని ప్రపంచస్థాయికి తీసుకెళ్లే 'భారత్ ఫ్యూచర్ సిటీ' కల సాకారమయ్యేందుకు తొలి అడుగు పడింది. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రధాన కార్యాలయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రోజు సాయంత్రం అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ భవన ప్రారంభోత్సవం అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో సీఎం ప్రసంగించనున్నారు. ఈ చారిత్రాత్మక సందర్భంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ.. "ఇది చరిత్రలో నిలిచిపోయే రోజు. ఆధునిక భారతదేశానికి నూతన నగరంగా ఈ భారత్ ఫ్యూచర్ సిటీ నిలవబోతోంది" అని అత్యంత ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు. ఈ అథారిటీ భవనాన్ని కేవలం 6 నెలల రికార్డు సమయంలోనే నిర్మించి పూర్తి చేయడం విశేషం. దాదాపు రూ. 20 కోట్ల వ్యయంతో, 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ అత్యాధునిక భవనాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. ప్రణాళిక, సాంకేతికత, సుస్థిర అభివృద్ధికి ఈ ఫ్యూచర్ సిటీ ఒక నిలువెత్తు ప్రతీకగా మారబోతోందని సీఎం వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్‌లోని మరో విశేషం ఏంటంటే.. ఈ భవనం ప్రారంభం కాకముందే ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుండి 'నెట్ జీరో' భవనంగా గుర్తింపు పొందింది. అంటే పర్యావరణానికి - మిగతా 2 లో

వార్త వేకువ
తెలుగు దినపత్రిక
నిజం వైపు నిరంతరం...
గురువారం 11 - 06 - 2026

# సంపాదకీయం

## మయన్మార్‌తో చెలిమి

అనుచిత కారణాలవల్ల తరచు వార్తల్లో ఉండే మయన్మార్ నుంచి ఆ దేశాధ్యక్షుడు మిన్ ఆంగ్ హ్లాయింగ్ అయిదు రోజుల పర్యటన కోసం శనివారం మన దేశం వచ్చారు. ఆయనతోపాటు వచ్చిన బృందంలో కేబినెట్ మంత్రులు, వ్యాపారవేత్తలు ఉన్నారు. కొన్ని దశాబ్దాలక్రితం ఇలాంటి పర్యటన ఊహించలేం. ఎందుకంటే ఆ దేశం నిరంతరం సైన్యం పడగనీడలో మనుగడ సాగిస్తోంది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను సైన్యం బతకనీయదు. 2020లో తిరుగులేని మెజారిటీతో వరసగా రెండోసారి ఎన్నికైన ప్రజా స్వామ్య ఉద్యమ నేత ఆంగ్ సాన్ సూకీ నాయకత్వంలోని నేషనల్ లీగ్ ఫర్ డెమాక్రసీ (ఎన్ఎల్‌డీ) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా, ఏడాదిలోపే సైనిక దళాలు హస్తగతం చేసుకున్నాయి. మన పొరుగును మనం ఎంచుకోలేం. అక్కడ ఎలాంటి ప్రభుత్వాలుండాలో ఆశించటం కూడా అసాధ్యం. మారుతున్న ప్రపంచ పరిణామాల నేపథ్యంలో మన ప్రయోజనాలు తప్ప వేరే దేశంలో ప్రజాస్వామ్యం వర్ధిల్లాలని, అందుకోసం అక్కడి పాలకులపై 'నైతిక ఒత్తిడి' తీసుకురావాలనుకోవటం వృథా ప్రయాసగా, అనవసర చాదస్తంగా భావించే ధోరణి అలుముకుంది. మార్క్సిజాన్ని అనుసరిస్తున్నానని చెప్పుకొనే చైనా దశాబ్దాల క్రితమే ఈ సూత్రాన్ని నమ్మి మయన్మార్‌ను అక్కున చేర్చుకుని అన్నివిధాలా లాభపడింది. వాస్తవానికి మయన్మార్‌తో మన దేశానికి సన్నిహిత సంబంధాలుండేవి. 1951లో ఆ దేశంతో స్నేహ ఒప్పందం కుదిరింది. 1955లో మనతోపాటు అలీనోద్యమ అంకు రార్పణకు తోడ్పడిన దేశాల్లో మయన్మార్ ఒకటి. కానీ 1958లో సైనిక పాలకుల ఆగమనం తర్వాత ఆ సంబంధాలు దెబ్బతిన్నాయి. మనమే కాదు... దాదాపు ప్రపంచ దేశాలన్నీ దానితో 'దౌత్యపరమైన అంటరానితనాన్ని' పాటించటం మొదలెట్టాయి. 1988లో ప్రజాస్వామ్య ఉద్యమాన్ని సైనిక పాలకులు అణిచేయటాన్ని నిరసిస్తూ సూకీకి భారత్ మద్దతు ప్రకటించింది. 1992లో జవహర్‌లాల్ నెహ్రూ అంతర్జాతీయ అవగాహన అవార్డుకు ఆమెను ఎంపిక చేసింది. కానీ వాజ్‌పేయి నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం 2002లో మళ్లీ దాంతో సంబంధ బాంధవ్యాలు పునరుద్ధరించి మాండలేలోని భారత కాన్సులేట్‌ను పునఃప్రారంభించింది. తిరిగి మళ్లీ 2014లో నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని ఎన్డీయే అధికారంలోకొచ్చేవరకూ ఇరు దేశాల సంబంధాలూ అంతంత మాత్రమే. 2017లో మోదీ మయన్మార్‌ను సందర్శించారు. మన దేశానికి మయన్మార్‌తో 1,643 కిలోమీటర్ల పొడవునా అంతర్జాతీయ సరిహద్దు ఉంది. ఇందులో ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్ (520 కి.మీ.), నాగాలాండ్ (215 కి.మీ.), మిజోరం (510 కి.మీ.), మణిపూర్ (398 కి.మీ.)ఉన్నాయి. 2021లో తిరిగి సైనిక పాలకులు అధికారం చేజిక్కించుకున్నాక మన దేశం గతంలో మాదిరి మయ న్మార్‌ను ఏకాకిని చేయాలనుకోలేదు. నిరంతరం సంబంధ బాంధవ్యాల్లో ఉంటే అక్కడ ప్రజాస్వామ్య పునరుద్ధరణకు అది దోహదపడుతుందనీ, దాంతోపాటు సరిహద్దు భద్రత విషయంలో మన ప్రయోజనాలు నెరవేరుతాయనీ భావించింది. దానికితోడు మయ న్మార్‌ను దూరం చేసుకుంటే అది చైనాకు దగ్గరకావటం మినహా సాధించేదేమీ ఉండదని కూడా అనుకుంది. అందుకే కావొచ్చు... సైనిక చీఫ్ పదవి వదులుకుని, దేశాధ్యక్షుడైన రెండు నెలల్లోనే తన తొలి విదేశీ పర్యటనకు మిన్ మన దేశాన్ని ఎంచుకున్నారు. నిరుడు డిసెంబర్, ఈ ఏడాది జనవరి మధ్య జరిపిన ఎన్నికల్లో మిన్ భారీ ఓట్లతో విజయం సాధించారు. దాదాపు అన్ని విపక్షాలనూ ఎన్నికల్లో పాల్గొననీయకపోవటంవల్ల ఇది సాధ్యమైంది. ఆ సంగతలావుంచి మయన్మార్‌తో కుదిరిన ఒప్పందాలు మన దేశానికి వ్యూహాత్మకంగా, భద్రతాపరంగా మేలుచేసేవే. అంతర్జాతీయ కరెన్సీ బదులు మన రూపాయి, మయన్మార్ క్యాట్‌లలో లావాదేవీలు జరుపుకోవాలనీ... ఇంధనం, మైనింగ్, ఆగ్రో ప్రోసెసింగ్ రంగాల్లో సహకరించుకోవాలనీ నిర్ణయించుకున్నాయి. అలాగే నౌకా శ్రయ నిర్మాణంలో మయన్మార్‌కు తోడ్పడేందుకు అవగాహన కుదిరింది. ఈశాన్య రాష్ట్రాల్లో అలజడి రేపే సంస్థలకు ఆశ్రయం లభించకుండా చర్యలు తీసుకుంటామని మయన్మార్ హామీ ఇచ్చింది. వర్తమానంలో ఇరుగు పొరుగుమధ్య సర్దుబాట్లు తప్ప 'అనవసర' చాదస్తాలు ఉండబోవని ఈ పర్యటన నిరూపించింది.

## మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ రద్దు

**మొదటిపేజీ తరువాయి -** వెల్లడించలేదనే కారణంతో నామినేషన్‌ను తిరస్కరించారు. దీనిపై బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. అయితే కాంగ్రెస్ వాదన మరోలా ఉంది. హైదరాబాద్‌లోని కోర్టు జారీ చేసిన నోటీసు కేవలం ప్రాథమిక విచారణలో భాగమే తప్ప, ఆమెపై అధికారిక క్రిమినల్ కేసు నమోదు కాలేదని చెబుతోంది. ఇంకా కోర్టు నేరాన్ని పరిగణనలోకి తీసుకోలేదని, ఎలాంటి అభియోగాలు కూడా నమోదు కాలేదని పేర్కొంటోంది. ఈ వివాదానికి కేంద్రంగా నిలిచింది ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 33ఏ. దీని ప్రకారం రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ జైలు శిక్ష పడే నేరానికి సంబంధించి కోర్టు అభియోగాలు నమోదు చేసిన కేసులు ఉంటే వాటిని అభ్యర్థులు నామినేషన్ పత్రాల్లో వెల్లడించాలి. అలాగే ఏడాది లేదా అంతకంటే ఎక్కువ జైలు శిక్ష పడిన తీర్పులు ఉంటే కూడా తెలియజేయాలి. న్యాయ నిపుణుల అభిప్రాయం ప్రకారం కేవలం ప్రాథమిక విచారణ దశలో ఉన్న వ్యవహారాలను వెల్లడించాల్సిన అవసరం ఉండకపోవచ్చు. ఎందుకంటే అలాంటి సందర్భాల్లో కేసు పూర్తిస్థాయిలో ప్రారంభమైనట్లు పరిగణించరు. మీనాక్షి నటరాజన్ విషయంలో హైదరాబాద్ కోర్టు జారీ చేసిన నోటీసు వెల్లడించాల్సిన కేసు పరిధిలోకి వస్తుందా? లేక అది కేవలం ప్రాథమిక విచారణ మాత్రమేనా? అన్న అంశంపైనే ఇప్పుడు మొత్తం వివాదం కొనసాగుతోంది. ఈ అంశంపై ఎన్నికల సంఘం తుది నిర్ణయం కీలకంగా మారింది.

## ప్రధానిగా నెహ్రూ రికార్డును బ్రేక్ చేసిన నరేంద్రమోదీ

**మొదటిపేజీ తరువాయి -** ఘనతను అభినందిస్తూ కేంద్ర కేబినెట్ తీర్మానం చేసింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్ షా సహా పలువురు బీజేపీ అగ్రనేతలు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## 'భారత్ ఫ్యూచర్ సిటీ' కల సాకారమయింది

**మొదటిపేజీ తరువాయి -** ఎలాంటి హాని చేయకుండా, సహజ వనరుల వినియోగంతో ఈ కార్యాలయాన్ని రూపొందించారు. ప్రపంచంలోని అత్యంత గొప్ప నగరాల్లో ఒకటిగా ఈ ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు వెళ్తోందని సీఎం స్పష్టం చేశారు.

## 2047 వరకు మోదీయే ప్రధానిగా కొనసాగాలి

**మొదటిపేజీ తరువాయి -** తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును బద్దలు కొట్టారని కేంద్ర మంత్రి బండి సంజయ్ కొనియాడారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. ప్రస్తుతం భారతదేశంలో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందించిన అరుదైన రికార్డు మోదీ పేరిట లిఖించబడిందని హర్షం వ్యక్తం చేశారు. "రాబోయే 2047 సంవత్సరం వరకూ నరేంద్ర మోదీయే దేశ ప్రధానిగా కొనసాగాలి. ఆయన తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాల వల్ల ప్రపంచ దేశాల ముందు భారతదేశ కీర్తి ప్రతిష్ఠలు శరవేగంగా పెరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో ప్రపంచంలోనే భారత్‌ను 'విశ్వగురు' స్థానంలో నిలబెట్టడం ఖాయం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇదే సమయంలో, దేశవ్యాప్తంగా సంచలనం రేపుతున్న కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ వ్యవహారంపై మీడియా అడిగిన ప్రశ్నకు బండి సంజయ్ స్పందించారు. ఆ వివాదం పూర్తిగా కేంద్ర ఎన్నికల కమిషన్ పరిధిలోని అంశమని స్పష్టం చేశారు. ఇందులో రాజకీయ జోక్యం ఏమీ లేదని, చట్టప్రకారం ఈసీనే దానిపై తగిన నిర్ణయం తీసుకుంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

## ఐటీ ఏరియాలో ఈగల్ ఫోర్స్ భారీ ఆపరేషన్

EAGLE FORCE
TELANGANA
ELITE ACTION GROUP
FOR DRUG LAW ENFORCEMENT

**మొదటిపేజీ తరువాయి -** డ్రగ్‌డాన్ నీతుబాయ్ కోసం ఈగల్ ఫోర్స్ భారీ ఆపరేషన్ నిర్వహించింది. ఈగల్ ఫోర్స్ వస్తుందన్న సమాచారంతో డ్రగ్‌డాన్ నీతూబాయ్ పారిపోయింది.

**ఈగల్ ఫోర్స్ అదుపులో ఐటీ ఉద్యోగులు :** హైదరాబాద్ నగరంలో నీతూబాయ్ పెద్ద ఎత్తున గంజాయి విక్రయిస్తోంది. గంజాయి కొనుగోలు కోసం ఐటీ ఉద్యోగులు ఆమె ఇంటి దగ్గర క్యూ కట్టారు. గంటల వ్యవధిలో 50 మంది ఐటీ ఉద్యోగుల్ని ఈగల్ ఫోర్స్ పట్టుకుంది. ఆమె దూల్‌పేట నుంచి వచ్చి ఐటీ కోర్ ఏరియాలో గంజాయి కేంద్రాన్ని నిర్వహిస్తోంది. కిరాణం షాపు మాటున గంజాయి విక్రయిస్తోందని సమాచారం. పోలీసులు గతంలోనే ఆమెను అరెస్టు చేసి పీడీ యాక్ట్ పెట్టారు. అయినా జైలు నుంచి వచ్చి మళ్లీ గంజాయి అమ్మకాలు కొనసాగిస్తోంది.

# అమరావతిలో రూ.1235 కోట్లతో కేంద్రం భారీ ప్రాజెక్ట్



**మొదటిపేజీ తరువాయి -** ప్రీ-బిడ్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని, టెండర్ పత్రాల రూపకల్పన ప్రక్రియ పురోగతిలో ఉందని కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో, ముఖ్యంగా రాజధాని అమరావతిలో కేంద్రం చేపడుతున్న మొట్టమొదటి జనరల్ పూల్ రెసిడెన్షియల్ అకామడేషన్ (జీపీఆర్ఏ) ప్రాజెక్ట్ ఇదే కావడం గమనార్హం. మొత్తం 17 ఎకరాల విస్తీర్ణంలో ఈ జీపీఆర్ఏ క్యాంపస్‌ను నిర్మించనున్నారు. ఇందులో భాగంగా 11 నివాస టవర్లను ఏర్పాటు చేసి, టైప్-×× నుంచి టైప్-ఎ× వరకు వివిధ కేటగిరీలలో మొత్తం 1,504 ఫ్లాట్లను నిర్మిస్తారు. ప్రాజెక్టులో భాగంగా 1,972 కార్లు పార్క్ చేసుకునేలా బేస్‌మెంట్ పార్కింగ్ సదుపాయం కల్పిస్తారు. ఈ ప్రాజెక్టు మొత్తం నిర్మాణ విస్తీర్ణం 31.30 లక్షల చదరపు అడుగులుగా ఉంది.

**ప్రాజెక్ట్ లక్ష్యాలు.. ప్రయోజనాలు**

అమరావతిలో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై ఆర్థిక భారాన్ని తగ్గించి, వారికి తగిన నివాస సౌకర్యం కల్పించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. కార్యాలయాలకు సమీపంలోనే నివాసం ఉండటం వల్ల ఉద్యోగుల నైతిక స్థైర్యం, పనితీరు మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఇది ప్రభుత్వ కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా సాగేందుకు దోహదపడుతుందని ప్రకటనలో వివరించారు.

**పర్యావరణ హిత నిర్మాణం.. సకల సౌకర్యాలు**

ఈ ప్రాజెక్టును పూర్తిగా పర్యావరణ హితంగా, గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించనున్నారు. కనీసం 4-స్టార్ గ్రీహ (జీఆర్ఐహెచ్ఏ) రేటింగ్ సాధించేలా, ఇంధన సామర్థ్యం, నీటి సంరక్షణ, స్థానిక నిర్మాణ సామగ్రి వాడకం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తారు. క్యాంపస్‌లో బ్యాంకు, ఏటీఎం, పోస్టాఫీసు, కమ్యూనిటీ హాల్, ఫుడ్ కోర్ట్, షాపింగ్ కాంప్లెక్స్, గెస్ట్ హౌస్ వంటి అన్ని రకాల పౌర, సామాజిక సదుపాయాలు ఉంటాయి. అలాగే, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా అవరోధ రహిత వాతావరణాన్ని కల్పించనున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా. నిర్మాణ దశలో ఏటా సుమారు 7 లక్షల పనిదినాలు, ప్రాజెక్టు పూర్తయ్యాక నిర్వహణ దశలో ఏటా 50,000 పనిదినాల ఉపాధి కలుగుతుందని కేంద్రం తెలిపింది.

# భారీ మూల్యం తప్పదన్న డొనాల్డ్

**మొదటిపేజీ తరువాయి -** అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి పరాకాష్టకు చేరాయి. చర్చల ప్రక్రియలో ఇరాన్ జాప్యం వహిస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా హెచ్చరించారు. "మిడిల్ ఈస్ట్ రౌడీ చనిపోయాడు" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సంచలనం సృష్టిస్తున్నాయి. ఇరాన్‌లోని మౌలిక సదుపాయాలపై మరిన్ని దాడులు చేసే అవకాశం ఉందని సంకేతాలను ఆయన ఇచ్చారు. బుధవారం 'ట్రూత్ సోషల్' వేదికగా స్పందించిన ట్రంప్, "ఇరాన్ సైన్యం ప్రస్తుతం తీవ్ర అస్తవ్యస్త స్థితిలో ఉంది. వారి నౌకాదళం, వాయుసేనలు దాదాపుగా ఉనికి కోల్పోయాయి. చర్చలకు రావడంలో వారు ఇప్పటికే చాలా ఆలస్యం చేశారు, ఇప్పుడు దానికి తగిన ప్రతిఫలం అనుభవించక తప్పదు" అని పేర్కొన్నారు. అమెరికాకు చెందిన ఏహెచ్-64 అపాచీ హెలికాప్టర్‌ను కూల్చివేసిన ఘటన తర్వాత ఈ ఘర్షణ వాతావరణం నెలకొంది. దీనికి ప్రతిచర్యగా, మంగళవారం హోర్ముజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ వాయు రక్షణ వ్యవస్థలు, రాడార్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా దళాలు దాడులు నిర్వహించాయి. ఇది కేవలం ఆత్మరక్షణ కోసం చేపట్టిన చర్యేనని యూఎస్ సెంట్రల్ కమాండ్ స్పష్టం చేసింది. హెలికాప్టర్‌లోని ఇద్దరు సిబ్బందిని సురక్షితంగా రక్షించినట్లు వెల్లడించింది. అయితే, తమ డ్రోన్‌ను అమెరికా హెలికాప్టర్ ఢీకొట్టడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఇరాన్ వాదిస్తోంది. ఇందుకు ప్రతీకారంగా బహ్రెయిన్, జోర్డాన్, కువైట్‌లలోని అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణి దాడులు చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇరాన్ అణు, సైనిక కేంద్రాలపై అమెరికా-ఇజ్రాయెల్ దళాలు దాడులు చేసినప్పటి నుంచి ఈ వివాదం కొనసాగుతోంది. తాజా పరిణామాల ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరగగా, స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలను చవిచూశాయి.



## ఏపీలో తక్కువ జనాభా అయినా నిధుల్లో టాప్ 3లో ఏపీ



**మొదటిపేజీ తరువాయి -** మాట్లాడిన ఆయన, రాష్ట్రానికి లభిస్తున్న ప్రత్యేక ప్రయోజనాల వల్లే ఈ స్థాయిలో నిధులు మంజూరవుతున్నాయని వివరించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పటి వరకు రూ.7,700 కోట్లు అందాయని పెమ్మసాని వెల్లడించారు. అలాగే, రాష్ట్ర రాజధాని అమరావతిలో కీలక భవనాల నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వ రాబోయే మూడేళ్లలో పూర్తి చేసే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టులకు అవసరమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించగా, నిర్మాణ వ్యయాన్ని పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరించనుందని ఆయన పేర్కొన్నారు. అమరావతి క్యాపిటల్ నిర్మాణం, సెంట్రల్ సెక్రటేరియట్, ఔటర్ రింగ్ రోడ్ వంటి ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధికి అత్యంత కీలకమని మంత్రి స్పష్టం చేశారు. ఈ అంశాలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏపీ అభివృద్ధిని వేగవంతం చేసే ప్రక్రియలో భాగంగా ఈ నిర్ణయాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు మెరుగుపడటంతో పాటు, పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## 24 గంటల్లోనే చెప్పిన మాట నిలబెట్టుకున్న మంత్రి లోకేశ్



**మొదటిపేజీ తరువాయి -** గడవకముందే మంత్రి లోకేశ్ చర్యలు చేపట్టారు. మృతుల కుటుంబాలకు తక్షణ పరిహారం కింద రూ. 25 లక్షల చొప్పున చెక్కులను స్వయంగా అందించారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షలు, క్షతగాత్రులకు రూ. 10 లక్షలు అందిస్తామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రకటించారు. దీనికి అదనంగా రెగ్యులర్ ఉద్యోగి కుటుంబానికి అన్ని ప్రయోజనాలు కలిపి రూ. 1.72 కోట్లు, ఒప్పంద ఉద్యోగి కుటుంబానికి రూ. 45 లక్షలు అందుతాయని వివరించారు. మృతుడు శాశ్వత ఉద్యోగి అయినా, ఒప్పంద ఉద్యోగి అయినా వారి కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పిస్తామని, వారి పిల్లల చదువుల బాధ్యతను కూడా ప్రభుత్వమే తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపేందుకు కేంద్ర ఉక్కుశాఖ ఇప్పటికే త్రిసభ్య కమిటీని నియమించింది. బొకారో సెయిల్ డైరెక్టర్ ప్రియరంజన్ నేతృత్వంలోని ఈ కమిటీ ప్రమాద స్థలాన్ని పరిశీలించింది. మరో రెండు రోజుల పాటు విశాఖలోనే ఉండి ప్రమాదానికి గల కారణాలను శోధించనుంది. ఈ దుర్ఘటన కారణంగా స్టీల్‌ప్లాంట్‌కు భారీ ఆర్థిక నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. రెండు రోజుల పాటు ఉత్పత్తి నిలిచిపోవడంతో సుమారు రూ. 100 కోట్లు, యంత్ర పరికరాలు దెబ్బతినడం వల్ల మరో రూ. 20 కోట్లు, మొత్తంగా రూ. 120 కోట్లకు పైగా నష్టం జరిగిందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎస్ఎంఎస్-1లోని ఒక మిషన్ ఆగిపోగా, మిగిలిన ఐదు మిషన్లతో ఉత్పత్తిని పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

# ఉత్తర, దక్షిణ విభజన, తెలంగాణ ఏర్పాటుకు వ్యతిరేకతపై పవన్ కల్యాణ్ స్పందన

**ఉత్తర-దక్షిణ విభజన వాదం దేశానికి ప్రమాదకరమని పవన్ హెచ్చరిక**

**తొలిసారిగా ఏఎన్ఐకి ఇచ్చిన పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో కీలక వ్యాఖ్యలు**

**రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టవద్దు**

**ఏపీకి రూ.7,707 కోట్లు కేటాయించిన కేంద్రానికి ధన్యవాదాలు**

**తాను తెలంగాణను ఎప్పుడూ వ్యతిరేకించలేదన్న పవన్ కల్యాణ్**

**విభజన జరిగిన తీరును మాత్రమే వ్యతిరేకించినట్లు వెల్లడి**



ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టే ధోరణులు దేశ సమగ్రతకు అత్యంత ప్రమాదకరమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా హెచ్చరించారు. ఇలాంటి విభజనవాద ధోరణులు దేశ శ్రేయస్సుకు ఏమాత్రం శ్రేయస్కరం కావని ఆయన స్పష్టం చేశారు. తాను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఎన్నడూ వ్యతిరేకించలేదని, కేవలం విభజన జరిగిన అశాస్త్రీయ విధానాన్ని మాత్రమే తప్పుబట్టానని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. తొలిసారిగా ఆయన ఢిల్లీలో ఏఎన్ఐ వార్తాసంస్థ ఎడిటర్ స్మితా ప్రకాశ్‌తో నిర్వహించిన పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజకీయాలు, పరిపాలన, వ్యక్తిగత అంశాలతో పాటు పలు జాతీయ అంశాలపై ఆయన సుదీర్ఘంగా మాట్లాడారు. సుమారు 84 నిమిషాల పాటు సాగిన ఈ ఇంటర్వ్యూలో పవన్ మాట్లాడుతూ, రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న నాయకులు ఒక ప్రాంతాన్ని మరో ప్రాంతంతో పోల్చి ప్రజల మధ్య వైషమ్యాలు పెంచడం సరికాదన్నారు. గతంలో కొందరు నేతలు తనను హైదరాబాద్ రావొద్దని అన్నారని గుర్తుచేస్తూ, అదే తర్కాన్ని పాటిస్తే రాహుల్ గాంధీ వంటి జాతీయ నాయకులను కూడా కొన్ని ప్రాంతాలకు వెళ్లవద్దని చెప్పాల్సి ఉంటుందని, ఇటువంటి సంకుచిత రాజకీయాలు దేశానికి తగవని హితవు పలికారు. 570కి పైగా సంస్థానాలను విలీనం చేసి భారతదేశాన్ని పటిష్ఠం చేసిన చరిత్రను స్మరిస్తూ, విభజనవాదం దేశ ఐక్యతకు గొడ్డలిపెట్టు అని ఆయన అభిప్రాయపడ్డారు. 'వీబీ జీ రామ్ జీ' పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు రూ.7,707.21 కోట్లు కేటాయించినందుకు పవన్ కల్యాణ్ కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. దేశవ్యాప్తంగా రాష్ట్రాలకు అందిన నిధుల్లో ఇది మూడో అత్యధిక కేటాయింపు అని ఆయన పేర్కొన్నారు. ఈ నిధుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడటంతో పాటు ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నదే తన ఆకాంక్ష అని పవన్ కల్యాణ్ తెలిపారు. తెలంగాణలో కూడా తమ పార్టీ పోటీ చేయాలని పార్టీ శ్రేణులు కోరుతున్నారని వెల్లడించారు. ఈ దేశంలో పౌరులు ఎవరైనా, ఎక్కడికైనా వెళ్లే స్వేచ్ఛ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ ఇంటర్వ్యూలో భాగంగా తెలంగాణపై తన భవిష్యత్ ప్రణాళికలు, ఆధ్యాత్మిక విశ్వాసాలు, ఉచిత పథకాల ప్రభావం, భాషా రాజకీయాలు, ఐటీ రంగంలో ఉద్యోగాల కల్పన వంటి అనేక అంశాలపై పవన్ తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఎన్డీయే సమావేశాల నిమిత్తం ఢిల్లీలో ఉన్న తరుణంలో ఆయన ఈ పాడ్‌కాస్ట్‌లో పాల్గొనడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జూపల్లి


**మినీ స్టేడియం కోసం సొంత భూమి విరాళం!**

**గతంలో వీపనగండ్ల వెళ్లినప్పుడు మినీ స్టేడియం కావాలని జూపల్లిని అడిగిన స్థానిక యువత**

**తన సొంత భూమి ఇస్తానని నాడు మాట ఇచ్చిన జూపల్లి**

**రూ. 1.50 కోట్లకు పైగా విలువున్న భూమిని విరాళంగా ఇచ్చిన మంత్రి**

రాజకీయాల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే నేతలు చాలా అరుదుగా ఉంటారు. అలాంటి వారిలో తాను ఒకడినని నిరూపించుకున్నారు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు. యువత, క్రీడాకారుల భవిష్యత్తు కోసం ఆయన ఒక అద్భుతమైన నిర్ణయం తీసుకున్నారు. మినీ స్టేడియం నిర్మాణం కోసం తన సొంత భూమిని కేటాయిస్తూ బుధవారం అధికారికంగా డిజిటల్ సంతకాలు చేశారు. గతంలో వీపనగండ్ల మండల పర్యటనకు వెళ్లిన సమయంలో.. అక్కడ స్థానిక యువత, క్రీడాకారులు తమకు ఒక మినీ స్టేడియం కావాలని మంత్రి జూపల్లిని అభ్యర్థించారు. వారి కోరికపై సానుకూలంగా స్పందించిన మంత్రి, స్టేడియం నిర్మాణం కోసం తన సొంత భూమిని ఇస్తానని నాడు మాట ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీని నెరవేరుస్తూ.. వీపనగండ్ల మండల కేంద్రంలోని సర్వే నెం. 532/ఆ లో తన పేరిట ఉన్న 4 ఎకరాల భూమిని క్రీడాకారుల అభివృద్ధి కోసం అందజేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేర్ మండల తహశీల్దార్ కార్యాలయంలో ఈ భూ బదిలీ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా పూర్తయింది. వీపనగండ్ల మండల తహశీల్దార్ లాగిన్ ద్వారా నిర్వహించిన ఈ ఆన్‌లైన్ ప్రక్రియలో మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా డిజిటల్ సంతకం చేసి భూమిని ప్రభుత్వానికి బదిలీ చేశారు. మంత్రి కేటాయించిన ఈ నాలుగు ఎకరాల భూమి ప్రస్తుత మార్కెట్ విలువ సుమారు రూ. 1.50 కోట్లకు పైగానే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఈ చారిత్రాత్మక భూ బదిలీ ప్రక్రియకు సాక్షులుగా కాంగ్రెస్ నాయకుడు మునిగొండ గోపి, జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ డిజిటల్ సంతకాలు చేశారు. మంత్రి తీసుకున్న ఈ ఉదార నిర్ణయంపై వీపనగండ్ల మండల ప్రజలు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత యువత, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మినీ స్టేడియం అందుబాటులోకి వస్తే.. గ్రామీణ ప్రాంతాల్లోని అద్భుతమైన ప్రతిభ గల యువకులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగేందుకు ఒక గొప్ప వేదిక లభిస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



వార్త వేకువ
తెలుగు దినపత్రిక
నిజం వైపు నిరంతరం...
గురువారం 11 - 06 - 2026

# తాహాశీసిల్దార్ కార్యాలయం ఎదుట, బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా...

## నూతన ఆర్టీసీ బస్టాండ్ ను నిర్మించాలని డిమాండ్




**భద్రాద్రి జిల్లా జూన్ 10 (వార్తవేకువ) :** మణుగూరు పట్టణ కేంద్రంలో నూతన ఆర్టీసీ, బస్టాండ్ నిర్మించేందుకు, గత కెసిఆర్ ప్రభుత్వంలో ప్రస్తుత మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు, ఆనాడు, కెసిఆర్ ప్రభుత్వంలో, ప్రభుత్వ, విప్, గా ఉండి, సుమారు 5, కోట్లు నిధులు మంజూరు చేపించి,గత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ప్రస్తుత మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, తో భూమి పూజ నిర్వహించగా నేటికీ ఆ పనులు ప్రారంభించకపోవడం పట్ల,పట్టణ బిఆర్ఎస్, పార్టీ శ్రేణులు అభిమానులు, బుధవారం, మణుగూరు మండల కేంద్రంలోని తాహాశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి నిరసన తెలుపుతూ, ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం, మండల తాహాశీల్దార్,కి, వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు,వట్టం,రాంబాబు,విలేకరులతో, మాట్లాడుతూ, ఇకనైనా,ఉమ్మడి ఖమ్మం జిల్లా మంత్రులు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపించాలని, నూతన బస్టాండ్ నిర్మాణాన్ని చేపట్టాలని ప్రభుత్వాన్ని అధికారులను, ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మణుగూరు మండల బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అనుబంద సంఘాలు నాయకులు కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల గ్రామసభ ఉత్సవాల్లో పాల్గొన్న డీఎస్పీ రవీందర్ రెడ్డి,



**భద్రాద్రి జిల్లా జూన్ 10 (వార్తవేకువ) :** మణుగూరు మండలంలోని సమితి సింగారం గ్రామపంచాయతీలో జరిగిన గ్రామసభ,ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక.. 99 రోజుల ప్రణాళిక కార్యక్రమాలు ముగింపు సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో గ్రామ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన డి.ఎస్.పి రవీందర్ రెడ్డి, సీఐ నాగబాబు, మండల ఎంపీ ఓ పల్నాటి వెంకటేశ్వరరావు,ఈ సందర్భంగా సమితి సింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, వారు ఇరువురు, మాట్లాడుతు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి మరియు సంక్షేమ ఫలాలను ప్రజలకు అందివ్వడం జరిగిందని తెలుపుతూ, పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు సారథ్యంలో సమితి సింగారం గ్రామపంచాయతీలో అనేక అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, పినపాక నియోజకవర్గం అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న నాయకుడు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అని వారు కొనియాడారు.డీఎస్పీ వంగ రవీందర్ రెడ్డి మాట్లాడుతు, ప్రజలు క్రమశిక్షణతోట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని, అలాగే, యువత గాని విద్యార్థులు, ఎటువంటి మత్తు పదార్థాలకు ఆకర్షనీతులు కావద్దని అన్నారు.ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతు ప్రజలు పారిశుద్ధంపై అవగాహన కలిగి ఉండాలని రాబోయే వర్షాకాలంలో ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచన చేశారు.ఈ కార్యక్రమంలో, ప్రభుత్వ వైద్యశాల సూపర్డెంట్ డాక్టర్ గౌరీ ప్రసాద్, జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రిన్సిపాల్, మరియు పంచాయతీ కార్యదర్శి జక్కుల అశోక్, మండలంలోని వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామపంచాయతీ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం మైనార్టీ గురుకుల పాఠశాలలో ఎలక్ట్రిషన్ పోస్టు దరఖాస్తుల ఆహ్వానం

## ప్రిన్సిపాల్ రాజసమ్మయ్య



**భద్రాద్రి జిల్లా జూన్ 10 (వార్తవేకువ) :** భద్రాచలం పట్టణ కేంద్రంలోని మైనార్టీ పాఠశాల, కళాశాలలో ఎలక్ట్రిషన్ కం ప్లంబింగ్ (పి సి ఈ) పోస్టు కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజసమ్మయ్య, బుధవారం, ఒక ప్రకటన ద్వారా తెలిపారు, ఆసక్తి గల అభ్యర్థులు, పదవ తరగతి ఉత్తీర్ణతతో పాటు ఐటిఐ పాసై, రెండు సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలని అన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, అభ్యర్థులు తమ దరఖాస్తు తో పాటు, స్టడీ సర్టిఫికెట్ జిరాక్స్, పదవ తరగతి, ఐటిఐ పాస్ మెమోల తో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, మరియు రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోల తో నేరుగా పాఠశాలకు వచ్చి 11వ, 12వ, 13వ ,తేదీ లోపు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4:30 వరకు దరఖాస్తులను సమర్పించవలసిందిగా కోరారు, ఇతర వివరాలకై 70139 17479 నెంబర్ కు సంప్రదించాలని తెలిపారు.

# బ్రహ్మపురి కాలనీ సమస్యల పరిష్కారానికి ఏం పరమేష్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చిన కాలనీ అధ్యక్షులు కార్యవర్గం





**భువనగిరి రూరల్ జూన్ 10 (వార్తవేకువ) :** శక్తిసాయి నగర్ డివిజన్ పరిధిలోని బ్రహ్మపురి కాలనీలో నెలకొన్న డ్రైనేజీ మరియు రోడ్ల సమస్యల శాశ్వత పరిష్కారానికి,గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో,ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి కలిసి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బ్రహ్మపురి కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు మరియు కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. అధ్యక్షులు మాధ లావణ్య శంకర్ గౌడ్ మాజీ సర్పంచ్ ప్రధాన కార్యదర్శి -- సుడి నరేందర్ రెడ్డిఅలాగే కాలనీ అసోసియేషన్ సభ్యులు యాకుబ్ పాషా, పాటి రాజ్ రెడ్డి, బూడిద స్వామి గౌడ్, బీసా సత్యనారాయణ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రవికాంత్ గౌడ్, భూమల్ల లక్ష్మణ్, గురువయ్య గార్లు పాల్గొన్నారు. అదేవిధంగా ఉమ్మడి మల్లాపూర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కప్పర సాయి, కోయిగూర బాలరాజ్ గౌడ్, విజయ్ రెడ్డి గార్లు, హెచ్‌బీ కాలనీ కాంగ్రెస్ నాయకులు రూపేందర్ రెడ్డి, బాలకృష్ణ గార్లు పాల్గొన్నారు

# కాప్రా నూతన తహసీల్దార్ మతిన్‌కు శాలతో సన్మానం పత్తి కుమార్

## ప్రజాసేవలో విజయవంతం కావాలని ఆకాంక్ష



**కాప్రా, జూన్ 10 (వార్తవేకువ) :** కాప్రా తహసీల్దార్ కార్యాలయానికి నూతనంగా నియమితులైన తహసీల్దార్ మతిన్ ని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా పూలగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి తమ శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతలు స్వీకరించిన మతిన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ సేవలను పారదర్శకంగా, సమర్థవంతంగా అందించాలని నాయకులు ఆకాంక్షించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తే ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పత్తి కుమార్, సతీష్ యాదవ్, తోటకూర శ్రీకాంత్, చింతల ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు. కాప్రా ప్రాంత అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు, సామాజిక నాయకులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు.నూతన తహసీల్దార్ మతిన్ కూడా ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ విధానాలను సమర్థవంతంగా అమలు చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

# మహేశ్వరం నియోజకవర్గంలో జనప్రభంజనం

## సీఎం రేవంత్ రెడ్డి గారి ప్రోగ్రామ్‌కు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కదిలిన వేలాది మంది శ్రేణులు!

**మహేశ్వరం నియోజకవర్గం జూన్ 10 (వార్తవేకువ):** తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తును మార్చే ప్రతిష్టాత్మక ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయాలు మరియు స్కిల్ యూనివర్సిటీ భవనాల ప్రారంభోత్సవానికి మహేశ్వరం నియోజకవర్గం నుండి అపూర్వ స్పందన లభించింది.ఏఐసీసీ విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ శ్రీ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి పిలుపునకు నాదర్గుల్ డివిజన్-57 కాంగ్రెస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు మరియు యువత నీరాజనం పలికారు.

### అల్మాస్‌గూడ వేదికగా జనసందోహం..

ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారి కార్యక్రమాన్ని చారిత్రాత్మక విజయవంతం చేసేందుకు శ్రీ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో నేడు అల్మాస్‌గూడ వై.ఎస్.ఆర్ పార్క్ సెంటర్ నుండి సమర్థవంతమైన సమన్వయం మరియు నాయకత్వ పటిమకు నిదర్శనంగా, కేవలం ఒకే ఒక్క పిలుపుతో 1,000 కి పైగా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,బోయపల్లి వెంకటరెడ్డి, దిండు శ్రీనివాస్ గౌడ్, చింటూ, సునీల్, పండు, తేజ, బన్నీ, పవన్, అలాగే కార్యకర్తలు, అభిమానులు మరియు నియోజకవర్గ యువజనులు ఒకే చోటకు తరలివచ్చారు.




### రాఘవేందర్ రెడ్డి నాయకత్వంలో సీఎం ప్రోగ్రామ్‌కు సగర్వంగా..



అల్మాస్‌గూడ వై.ఎస్.ఆర్ పార్క్ సెంటర్ నుండి బయలుదేరిన ఈ భారీ జనసమూహం, శ్రీ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి గారి దిశానిర్దేశంలో క్రమశిక్షణతో, జై కాంగ్రెస్.. జై రేవంత్ రెడ్డి.. జై బోయపల్లి రాఘవేందర్ రెడ్డి నినాదాలతో సీఎం గారి కార్యక్రమానికి సగర్వంగా తరలివెళ్లింది. సీఎం గారి ప్రోగ్రామ్‌ను ఇంతటి భారీ ఎత్తున విజయవంతం చేయడానికి తరలివచ్చిన ప్రతి ఒక్క కార్యకర్తకు, అభిమానికి మరియు కాంగ్రెస్ కుటుంబ సభ్యులకు శ్రీ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి గారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# కాలనీల అభివృద్ధి - డ్రైనేజ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం

## ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి





**మహేశ్వరం నియోజకవర్గం జూన్ 10 ( వార్తవేకువ) :** మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్పేట్ సర్కిల్ 57వ డివిజన్ నాదర్గుల్ అల్మాస్గూడ ప్రాంతంలోని స్వేచ్ఛ నివాస్, సౌభాగ్యపురం లో పర్యటించిన మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి గారు కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గతంలో కార్పొరేటర్ల సమన్వయంతో ప్రారంభమైన కొన్ని అభివృద్ధి పనులు మధ్యలో నిలిచిపోయిన నేపథ్యంలో వాటిని తిరిగి పూర్తి చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు.గత సంవత్సరం కాలంగా స్వేచ్ఛ నివాస్, సౌభాగ్యపురం ప్రాంతాల్లో డ్రైనేజ్ నీరు రోడ్లపైనే ప్రవహిస్తూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా గతంలో ప్రతిపాదించిన ఎస్ఎన్‌డీపీ నాలా పనులను మళ్లీ ప్రారంభిస్తున్నామని తెలిపారు.ఇప్పటికే పనులకు పరిపాలనా అనుమతులు తీసుకుని టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని, త్వరలో పనులు ప్రారంభించి పూర్తి చేస్తామని చెప్పారు. దాదాపు ఏడాది నుంచి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు ముగింపు పలికి భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.అదే విధంగా ప్రస్తుతం ఉన్న డ్రైనేజ్ వ్యవస్థను కూడా అప్‌గ్రేడ్ చేసి వర్షపు నీటి ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గతంలో తీర్మానించిన కొన్ని అభివృద్ధి పనులు మధ్యలో నిలిచిపోయిన నేపథ్యంలో కమిషనర్‌తో చర్చించి వాటిని తిరిగి ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. డ్రైనేజ్, రోడ్లు తదితర పనులకు బడ్జెట్ విడుదల చేయాలని కోరినట్లు చెప్పారు.దాదాపు 800 అభివృద్ధి పనులపై అధికారులు సమీక్ష నిర్వహిస్తున్నారని, నివేదికలు వచ్చిన వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని తెలిపారు.వర్షాకాలం దృష్ట్యా కాలనీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, స్థానికంగా ఉన్నటువంటి నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారంలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.‘ ప్రజలకు ఇబ్బంది లేకుండా -- శాశ్వత పరిష్కారాలే మా లక్ష్యం” అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సమ్ రెడ్డి వెంకట్ రెడ్డి, బోయపల్లి శేఖర్ రెడ్డి, రామిడి రామిరెడ్డి, ముత్యాల కృష్ణ, ఏనుగు రామిరెడ్డి, తుఫాన్ రెడ్డి, ముత్యం రెడ్డి, సత్తిరెడ్డి, కోటగిరి జంగయ్య, మహిళా నాయకురాళ్లు జాలే సరిత రెడ్డి, ఆకుల సరిత, గీత మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# మోదీ పాలన భారతదేశ చరిత్రలో ఎక్కువ కాలం ప్రధానిగా పాలన సందర్బంగా బాలాపూర్ లో మహాహారతి, ప్రత్యేక పూజలు

**బాలాపూర్ జూన్ 10 (వార్తవేకువ):** నూతన అధ్యాయం , ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి 4399 రోజుల సుదీర్ఘ ప్రజాసేవపై కొలను శంకర్ రెడ్డి హర్షమ్ , భారతదేశ చరిత్రలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికై, అత్యధిక కాలం నిరంతరంగా ప్రధానమంత్రిగా సేవలు అందిస్తున్న గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి చారిత్రాత్మక మైలురాయిపై బిజెపి నాయకులు శ్రీ కొలను శంకర్ రెడ్డి తన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.2026 జూన్ 10 నాటికి వరుసగా 4,399 రోజుల పాటు ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తూ ఈ అరుదైన రికార్డును సొంతం చేసుకోవడం దేశ ప్రజలు ఆయన నాయకత్వంపై ఉంచిన అపార విశ్వాసానికి నిదర్శనమని కొలను శంకర్ రెడ్డి పేర్కొన్నారు. “దేశం ముందుగా” అనే అద్భుతమైన పాలనా సిద్ధాంతంతో మోదీ గారు ముందుకు సాగుతున్నారని ఆయన కొనియాడారు.దశాబ్ద కాలపు సంస్కరణలు - దేశ ప్రగతికి బాటలు:గత 12 సంవత్సరాల మోదీ గారి పాలనలో దేశం అన్ని రంగాలలో అపూర్వమైన ప్రగతిని సాధించిందని శంకర్ రెడ్డి గుర్తుచేశారు. ఆయన ప్రస్తావించిన ముఖ్యమైన సంస్కరణలు:ఆర్థిక,



డిజిటల్ విప్లవం: జన్ ధన్ యోజన ద్వారా పేదలకు ఆర్థిక సమ్మిళితం, డిజిటల్ ఇండియా మరియు యూపీఐ ద్వారా ప్రపంచంలోనే అగ్రగామిగా డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ.ప్రజా సంక్షేమం: ఆయుష్మాన్ భారత్ ద్వారా కోట్లాది మందికి ఉచిత ఆరోగ్య భద్రత, పీఎం ఆవాస్ యోజన ద్వారా సొంతింటి కల, జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు.చారిత్రాత్మక నిర్ణయాలు: జీఎస్టీ అమలు, నూతన విద్యా విధానం, మరియు దేశ సార్వభౌమాధికారాన్ని చాటిచెప్పిన ఆర్టికల్ 370 రద్దు.సాధికారత: స్టార్టప్ ఇండియా ద్వారా యువతకు ఉపాధి, మహిళలు, రైతులు, పేదల ఆర్థిక, సామాజిక సాధికారతకు పెద్దపీట.వికసిత భారత్ - 2047:ప్రపంచ వేదికపై భారతీయ సంస్కృతిని, దేశ గౌరవాన్ని మోదీ గారు సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లారని కొలను శంకర్ రెడ్డి అన్నారు. 2047 నాటికి “వికసిత భారత్” (అభివృద్ధి చెందిన దేశం) లక్ష్య సాధన దిశగా దేశాన్ని నడిపిస్తున్న ప్రధాని గారి అంకితభావం, దృఢ సంకల్పం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని చెప్పారు. భారత మాతా సేవలో మోదీ గారి శక్తిమంతమైన నాయకత్వం మరింత శక్తి దేవుడు ఇవ్వాలని బిజెపి రాష్ట్ర నేత కోలన్ శంకర్ రెడ్డి అన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు శ్రీ గడ్డం వెంకటేష్ మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షులు, శ్రీ పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, దొడ్డి శ్రీశైలం, జోరల ప్రభాకర్, కల్లెం లక్ష్మారెడ్డి, మునగాల ప్రభాకర్ రెడ్డి , కొంతం సంపత్ రెడ్డి, రావుల మల్లేష్, పెద్దింటి సుధాకర్ రామిడి శేఖర్ రెడ్డి , రామాచారి సిరికొండ, కల్లెం మురళి రెడ్డి, నర్రె గోపాల్, మంగపతి నాయక్, కొంతం ప్రకాష్ రెడ్డి, క్యారాగరి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# 5 కి.మీ పరిధిలో వారికే 2బిహెచ్‌కే ఇండ్లు.. నివాసం లేకుంటే రద్దు

## కాలనీల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి

## - హౌసింగ్ ప్రత్యేక కార్యదర్శి వి.పి. గౌతం

**మేడ్చల్, జూన్ 10 (వార్తవేకువ) :** ప్రభుత్వం నిర్మించి కేటాయించిన డబుల్ బెడ్‌రూం గృహాల్లో లబ్ధిదారులు తప్పనిసరిగా నివాసం ఉండేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హౌసింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వి.పి. గౌతం అధికారులను ఆదేశించారు. ఇండ్లు కేటాయించబడినా కాలనీల్లో నివాసం ఉండని వారికి మరోసారి నోటీసులు జారీ చేసి, నిర్దేశిత గడువులోపు షిఫ్ట్ కాకపోతే కేటాయింపులు రద్దు చేయాలని సూచించారు.బుధవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి బౌరంపేట, గండిమైసమ్మ, దుండిగల్ ప్రాంతాల్లోని 2బిహెచ్‌కే కాలనీలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతి, మౌలిక వసతుల స్థితిగతులను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు.దుండిగల్ ఫేజ్-1 కాలనీలో పలువురు లబ్ధిదారులు ఇంకా నివాసం ఉండకపోవడాన్ని గుర్తించిన గౌతం, ప్రభుత్వ



సంక్షేమ పథకాల లక్ష్యాన్ని సాకారం చేయాలంటే లబ్ధిదారులు గృహాల్లో నివసించాలని అన్నారు. వేలాది మంది పేదలు ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో కేటాయించిన గృహాలను వినియోగించని వారి కేటాయింపులను రద్దు చేసి అర్హులైన ఇతరులకు అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు.అలాగే దుండిగల్ ఫేజ్-2 కాలనీలో కొనసాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ముఖ్యంగా రహదారులు, తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ సందర్భంగా 2బిహెచ్‌కే ఇండ్ల కేటాయింపులో ప్రభుత్వం కొత్త విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు.కాలనీలకు సమీపంగా 5 కిలోమీటర్ల పరిధిలో నివసించే అర్హులకే ఇండ్లను కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం గండిమైసమ్మ ప్రాంతంలో జరుగుతున్న సర్వే ప్రక్రియను పరిశీలించి, అర్హుల గుర్తింపును వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ప్రజాపాలన కార్యక్రమంలో ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్న, సొంత ఇల్లు లేదా ఇంటి స్థలం లేని ఎల్-2 జాబితాలోని కుటుంబాలను గుర్తించేందుకు నిర్వహిస్తున్న సర్వే వివరాలను సమీక్షించిన ఆయన, యాప్‌లో వివరాలను సక్రమంగా నమోదు చేసి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. పర్యటనలో హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ ఎం. చైతన్యకుమార్, సూపరింటెండింగ్ ఇంజనీర్ విజయకుమార్, హౌసింగ్ బోర్డు చీఫ్ ఇంజనీర్ జి.వి. రమణారెడ్డి, జిల్లా హౌసింగ్ పీడీ రమణమూర్తి, ఇంజనీర్లు, రెవెన్యూ, వాటర్‌వర్క్స్, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వార్డు సభలు నిర్వహించిన మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్



**కల్వకుర్తి జూన్ 10 (వార్తవేకువ) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈరోజు కల్వకుర్తి మున్సిపాలిటీలోని పలు వార్డులలో మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ గారు 19,20,21,22 వార్డులలో పర్యటించి వారి సమస్యలను తెలుసుకున్నారు వార్డులలోని ప్రజలు పలు సమస్యల మీద దరఖాస్తు పేపర్లు అందించారు



ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి పట్టణ అధ్యక్షుడు పుస్తకాల రాహుల్ కౌన్సిలర్లు చిమ్ముల లలిత శ్రీకాంత్ రెడ్డి మబ్బు రామరాజు కొల్లోజు రాజేష్ చిత్తారి ఎల్లమ్మ శీను కోడెల లలిత గణేష్ యాదవ్ ఎజాస్ మక్బుల్ మాజీ కౌన్సిలర్ నేరటి చిన్న నాయకులు సోఫి వెంకట్ రెడ్డి ఈశ్వర్ రేష్మ శివ రెహానా దున్న సురేష్ మున్సిపల్ అధికారులు వార్డుల ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

వార్త వేకువ
తెలుగు దినపత్రిక
నిజం వైపు నిరంతరం...
గురువారం 11 - 06 - 2026

# ప్రజల సంతృప్తే పనితీరుకు గీటురాయి

**ఇంటింటి చెత్త సేకరణ వంద శాతం జరగాలి**

**డ్రైనేజీ కాలువలు, రహదారులపై ఆక్రమణలు సరికాదు**

**నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**



**కర్నూలు** : కర్నూలు నగరపాలక సంస్థ అందిస్తున్న సేవలపై ప్రజలు సంతృప్తి చెందడమే ఉద్యోగుల పనితీరుకు నిజమైన కొలమానమని కమిషనర్ చల్లా ఓబులేసు పేర్కొన్నారు. బుధవారం పాతబస్తీలోని 3వ శానిటేషన్ డివిజన్ మస్టర్‌ను తనిఖీ చేశారు.అనంతరం బొంగుల బజార్, గౌలిగేరి, మండిబజార్, ఖడక్‌పూర్ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరా అంశాలపై ఆరా తీశారు. ప్రజల ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కరించారు. సచివాలయ సిబ్బందిపై ఫిర్యాదులు రావడంపై సంబంధిత సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. పనితీరును మరింత మెరుగుపరచుకోవాలని హితవు పలికారు.కాగా, బొంగుల బజార్‌లో ఓ నివాసితురాలు మార్చి నెలలో సచివాలయ అడ్మిన్‌కు ఆస్తి పన్ను చెల్లింపునకు నగదు ఇవ్వగా, దానిని చెల్లించకుండా, తిరిగి ఇవ్వకుండా, ఫోన్ కాల్స్‌కు స్పందించకుండా ఇబ్బంది పెట్టారని వాపోయారు. ప్రస్తుతం అతను బదిలీ అయిపోయాడని, గత్యంతరం లేక మరోసారి నగదు చెల్లించి ఆస్తి పన్ను చెల్లించామని తెలిపారు. దీంతో అసహనం వ్యక్తం చేసిన కమిషనర్, ప్రస్తుతం విధుల్లో ఉన్న అడ్మిన్ ఈ సమస్యను పరిష్కరించాలని, సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకుడి బాధ్యతగా సంబంధిత మొత్తాన్ని తిరిగి ఇప్పించాలని సూచించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఇంటింటి చెత్త సేకరణ, పూడికతీత వంటి పారిశుద్ధ్య పనులకు ఆటంకం కలిగేలా డ్రైనేజీ కాలువలు, రహదారులపై ఆక్రమణలు చేయడం సరికాదన్నారు. ప్రజలు సహకరించి మెరుగైన పారిశుద్ధ్య పనులకు ఆటంకం లేకుండా చూడాలని కోరారు. పారిశుద్ధ్య పర్యవేక్షక సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. విధులు సమర్థవంతంగా నిర్వహించడమే కాకుండా ప్రజలతో ఆప్యాయంగా వ్యవహరించినప్పుడే సానుకూల అభిప్రాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఆటంకాలు ఉన్నాయని సమస్యలను అలాగే వదిలేయడం సరికాదని, ఇతర విభాగాలతో సమన్వయం చేసుకుని వాటిని పరిష్కరించాలని హితవు పలికారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడం, పారదర్శకంగా వ్యవహరించడం, సేవల్లో నాణ్యత పెంచడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సూచనలను సానుకూలంగా స్వీకరించి సేవలను మరింత మెరుగుపరచాలని చెప్పారు. ప్రజల విశ్వాసం, సంతృప్తే పరిపాలన విజయానికి గీటురాయని కమిషనర్ పేర్కొన్నారు.అదేవిధంగా కొండారెడ్డి బురుజు అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి అల్పాహార నాణ్యతపై ఆరా తీశారు.కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ముర్తుజావలి తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో 26 మోడ్రన్ సిగ్నల్స్

**నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**



**కర్నూలు** : కర్నూలు నగరంలో మోడ్రన్ ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. బుధవారం వెంకటరమణ కాలనీలోని నగరపాలక కార్యాలయంలో ఆయన ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగాల అధికారులతో పాటు ట్రాఫిక్ పోలీసులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.పీపీపీ ప్రాజెక్టు కింద ప్రస్తుతం ఉన్న 16 ట్రాఫిక్ సిగ్నల్స్‌కు అదనంగా మరో 10 సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ వెల్లడించారు. నగరంలో ట్రాఫిక్ నిర్వహణను మరింత సులభతరం చేయడం, రోడ్డు భద్రతను మెరుగుపరచడం లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు.కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ట్రాఫిక్ సిఐ మన్సూరిద్దిన్, ఎస్‌ఈ రమణమూర్తి, ఇంచార్జీ సిటి ప్లానర్ వెంకటరమణ, ఎంఈ మనోహర్ రెడ్డి, డిఈఈలు శ్రీనిసవాసన్, పవన్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్'కు ప్రతి ఒక్కరూ సహకరించాలి

**కర్నూలు ఆర్వో, కమిషనర్ చల్లా ఓబులేసు**

**రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం**

**ఈ నెల 15 నుండి ఇంటింటికి బిఎల్వోలు**

**ప్రజలు పత్రాలు, వివరాలు సిద్ధం చేసుకోవాలి**

**కర్నూలు** : దేశవ్యాప్తంగా కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - ఎస్ఐఆర్) ను విజయవంతంగా పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కర్నూలు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు కోరారు. బుధవారం స్థానిక వెంకటరమణ కాలనీలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎస్ఐఆర్‌పై పవర్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆర్వో చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. ఈ నెల 15 నుండి బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్‌వోలు) ఇంటింటికి వస్తారని, వచ్చినప్పుడు బీఎల్‌వోలు అడిగే పత్రాలను, వివరాలను ప్రజలు ఇప్పుడే సిద్ధం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం బీఎల్‌వోలు మ్యాపింగ్ ప్రక్రియ చేపడుతున్నారని పేర్కొన్నారు.ప్రతి ఓటరుకు రెండు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేస్తారని, వాటిలో ఓటరు స్వయంగా పూర్తి చేసి బీఎల్‌వోకు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఒక ఫారంపై బీఎల్‌వో సంతకం చేసి ఎక్నాలెడ్జ్‌మెంట్‌గా ఓటరుకు అందజేస్తారని చెప్పారు.ప్రజలు తమ ఈపిక్ (ఓటరు గుర్తింపు) కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే 2002 సంవత్సరంలో తాము లేదా తమ కుటుంబ సభ్యులు నమోదు అయి ఉన్న ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రం వివరాలు, తల్లిదండ్రులు, తాతలు, అమ్మమ్మలు లేదా నానమ్మల ఈపిక్ కార్డులు అందుబాటులో ఉంటే మ్యాపింగ్ ప్రక్రియ మరింత సులభంగా జరుగుతుందని తెలిపారు.వివాహం తర్వాత ఇతర ప్రాంతాలకు వెళ్లిన మహిళలు, ఇటీవల ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకున్న వారు, తమ కుటుంబ సభ్యుల ఓటరు వివరాలను ముందుగానే సేకరించి ఉంచుకోవాలని సూచించారు. పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనలో భాగంగా ప్రతి ఒక్కరూ బీఎల్‌వోలకు సహకరించి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని



విజయవంతం చేయాలని ఆర్వో కోరారు. త్వరలో బిఎల్వోలు, బిఎల్ఏలకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, తహశీల్దార్ రవికుమార్, డిప్యూటీ తహశీల్దార్ ధనుంజయ, మేనేజర్ జునైద్, సూపరింటెండెంట్ రామకృష్ణ, రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# అద్దె చెల్లించని 45 మున్సిపల్ షాపులు సీజ్

**నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**



**కర్నూలు** : నగరపాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్‌లలో షాపులను లీజుకు తీసుకుని, నెలల తరబడి అద్దెలు చెల్లించకుండా మొండిగా వ్యవహరిస్తున్న లీజుదారుల షాపులను సీజ్ చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 45 షాపుల లీజుదారుల వద్ద నుండి సుమారు రూ.90 లక్షల బకాయిలు ఉన్నాయని పేర్కొన్నారు. గత వారం రోజులుగా ఆర్వోలు జునైద్, స్వర్ణలత, వాజిద్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించగా, సుమారు రూ.50 లక్షల వరకు బకాయిలను వసూలు చేసినట్లు తెలిపారు. మిగిలిన బకాయిదారులు కూడా వెంటనే తమ బకాయిలను చెల్లించాలని కమిషనర్ కోరారు.

# పద్మ అవార్డులు అర్హులైన వ్యక్తుల నుండి నామినేషన్ల ఆహ్వానం

**కర్నూలు** : గణతంత్ర దినోత్సవం--2027 సందర్భంగా భారత ప్రభుత్వం ప్రకటించనున్న పద్మ అవార్డుల కోసం నామినేషన్లు సిఫారసులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీమతి విజయ తెలిపారు.మహిళా సాధికారత, బాలల అభివృద్ధి, బాలల సంరక్షణ, విద్య, ఆరోగ్యం, సామాజిక సేవ తదితర రంగాలలో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులను పద్మ అవార్డుల కోసం సిఫారసు చేయవచ్చని ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి అర్హులైన అభ్యర్థులను గుర్తించే ప్రక్రియను ప్రారంభించినట్లు తెలిపారు.కర్నూలు జిల్లాలో మహిళలు మరియు బాలల సంక్షేమం కోసం విశేష కృషి చేసిన వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు మరియు ఇతర అర్హుల వివరాలను సంబంధిత



ఆధారాలతో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖకు పంపించాలని కోరారు.అర్హులైన వ్యక్తుల వివరాలు, వారి సేవల సంక్షిప్త నివేదిక, సంప్రదింపు వివరాలు తదితర సమాచారాన్ని 15 జూన్ 2026 లోపు జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయ తెలిపారు.

# కళలకు సరిహద్దులు లేవు

**రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్**



**కర్నూలు** : కళలకు, కళాకారులకు సరిహద్దులు లేవని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు.కర్నూల్ నగరానికి చెందిన టీజీ వెంకటేష్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన విద్యార్థులు వారం రోజులపాటు భూటాన్ దేశంలో ప్రదర్శనలు ఇచ్చారు. నేషనల్ యూత్ ప్రాజెక్టు వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎక్స్ఛేంజ్ కల్చరల్ డెవలప్మెంట్ కార్యక్రమంలో భాగంగా వీరు భూటాన్ కెళ్ళి విజయవంతంగా ప్రదర్శనలు ఇచ్చి కర్నూల్ కీర్తిని చాటిరావడం అభినందనీయమని టీజీ వెంకటేష్ అన్నారు. కళలు, కళాకారులు ఆయా దేశాల, ప్రాంతాల సంస్కృతిని, సామరస్యాన్ని తమ కళల ద్వారా ప్రదర్శిస్తారని ఆయన తెలిపారు. కర్నూల్ నగరానికి చెందిన పదిమంది కళాకారులు భూటాన్ కి వెళ్లి రావడం సంతోషకరమైన విషయమని ఇది కర్నూలుకే ఒక గుర్తింపు అని టీజీ వెంకటేష్ అన్నారు. ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యులు డాక్టర్ భార్గవ్ కుమార్ నేతృత్వంలో వెళ్లిన బృందాన్ని ఆయన శాలువలు కప్పి సత్కరించారు. ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని చేస్తూ మన కలల వైభవాన్ని చాటి చెప్పాలని టీజీ వెంకటేష్ కోరారు. ఈ కార్యక్రమంలో భూటాన్ కు వెళ్లి వచ్చిన కళాకా రులు హరినాథ్, గీతిక,సత్య శ్రీ,గీతాన్విత,హరిణి,సాయిహర్షిత,పూజిత, సుభిక్ష తదితరులు పాల్గొన్నారు.

# భూపనపాడులో అగ్నిప్రమాద బాధితులను పరామర్శించిన వైఎస్ఆర్సిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రామభూపాల్ రెడ్డి



**కర్నూలు** : పాణ్యం మండలం భూపనపాడు గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం వాటిల్లిన బాధితులను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి పరామర్శించారు.ఈ సందర్భంగా అగ్నిప్రమాదంలో బోనిగేని చిన్న సుబ్బరాయుడుకు చెందిన రెండు గడ్డివాములు, పశువుల పాకలో ఉన్న మోటార్ సైకిల్, వరి కోత యంత్రాల సామాగ్రి, వ్యవసాయ పరికరాలు, పైపులు తదితర వస్తువులు పూర్తిగా దగ్ధమై సుమారు రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లిందని తెలుసుకున్నారు.అలాగే బోనిగేని పెద్ద సుబ్బరాయుడుకు



చెందిన పశువుల పాక కూడా అగ్నికి ఆహుతైన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు.బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడిన పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి వారికి ధైర్యం చెబుతూ,10వేల రూపాయలు ఆర్థిక సాయం చేశారు అలాగే మండల అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి రెండు వేల రూపాయలు మరియు గ్రామ నాయకులు కృష్ణ మోహన్ గారు ఐదు వేల రూపాయలు ఆర్థిక అందించారు.కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ రైతుకు అవసరమైన పశుగ్రాసాన్ని, అందించే బాధ్యత తాను తీసుకుంటానని పశువులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గడ్డి ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. రైతులు, పేద కుటుంబాలు ఇటువంటి అనుకోని విపత్తులతో తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితులకు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు కష్టకాలంలో అండగా నిలవడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాణ్యం మండల అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి , గ్రామ నాయకులు నాగశేషులు , నంద్యాల జిల్లా యువజన విభాగం సెక్రెటరీ బాలుడు , కృష్ణ మోహన్ ,నంద్యాల జిల్లా పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు రామలక్ష్మణుడు, పిన్నాపురం సత్యాలు మరియు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభ చూపి పథకాలు సాధించండి

**కర్నూల్ మార్కెట్ యార్డ్ చైర్మన్ మాజీ శమంతకమణి**



**కర్నూలు** : క్రీడాకారులు ప్రతిభ చూపి పథకాల లక్ష్యంగా రాణించాలని కర్నూలు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ శమంతకమణి అన్నారు.బుధవారం కర్నూల్ నగరంలోని విద్యానగర్ మాంటిస్సోరి స్కూల్‌లో జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమెను మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై పథకాలు సాధించి తిరిగి రావాలని ఆకాంక్షించారు.బాక్సింగ్ అసోసియేషన్ ఆఫ్ కర్నూలు డిస్ట్రిక్ట్ సెక్రటరీ తేజ మాట్లాడుతూ అండర్-13, 14 కేటగిరీల్లో నిర్వహించిన ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు ఈ నెల 12, 13, 14 తేదీల్లో విజయనగరంలో జరిగే రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికవుతారు.ఈ కార్యక్రమంలో కోచ్‌లు నాగరాజు, సతీష్ కుమార్, టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పకడ్బందీగా చేయాలి

**స్వచ్ఛమైన ఓటర్ లిస్ట్ తయారు కావాలి**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి**



**కర్నూలు** : జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( ఎస్ఐఆర్ ) ప్రక్రియ పక్కద్బందీగా జరగాలని స్వచ్ఛమైన ఓటర్ లిస్ట్ తయారు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని ఈఆర్ఓ , ఏఈఆర్ఓ మరియు తహసిల్దారులతో ఎస్ఐఆర్ ప్రక్రియపై శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి / జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులకు పలు సూచనలు జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...నిన్నటి రోజు వరకు ఎస్ ఐ ఆర్ ప్రక్రియ లో భాగంగా మ్యాపింగ్ విషయంలో 77 శాతం తో కర్నూలు జిల్లా రాష్ట్రంలోనే ముందు ఉన్నదని తెలిపారు. అధికారులందరూ ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో పారదర్శకంగా పనిచేయాలని ఏ ఒక్కరి మెప్పుకోసం పనిచేయవలసిన అవసరం లేదని తెలిపారు. బిఎల్ఓ లతో పనివేళలో మాత్రమే టెలికాన్ఫరెన్స్ లు , సమావేశాలు పెట్టుకుని వారిని చైతన్యపరిచి అత్యంత సులువుగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తిచేసేలాగా ప్రేరేపించాలని ఆదేశించారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ వలస వెళ్లిన వారి ఓటు హక్కును తొలగించరాదని , అన్ని వివరాలు సమగ్రంగా క్రోడీకరించుకొని అప్పుడు నోటీసులు ఇచ్చి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బి ఎల్ వోలు ఇంటింటికి ఈనెల 15వ తారీకు నుండి వచ్చేనెల 14వ తారీకు వరకు వెళ్లి వారికి ఎన్యుమరేషన్ ఫారం ఇచ్చి వాటిలో సమగ్ర వివరాలు తీసుకోవాలని వారి ఫోటోలు కూడా తీసుకోవాలని తెలిపారు.ఇంటిలో ఎవరూ లేకపోతే , తాళం వేసి ఉంటే మూడుసార్లు ఆ ఇంటికి తప్పక వెళ్లాలని వివరాలు సేకరించాలని తెలియజేశారు. చనిపోయిన , శాశ్వతంగా వేరే ప్రదేశానికి వెళ్లిన , డబుల్ ఎంట్రీ డూప్లికేట్ మరియు ఇంటిలో లేని వారి వివరాలు అన్ని ఫారంలలో తీసుకొని నోటీసులు ఇచ్చి ఆపై వారు వివరాలు ఇవ్వనిచో జిల్లా ఎన్నికల అధికారికి నివేదించాలని తెలియజేశారు. 2002 మరియు 2025 ఓటర్ల లిస్టు తో మ్యాపింగ్ పట్టణాలలో 80 శాతం మిగిలిన ప్రదేశాలలో 90 శాతం తప్పక జరగాలని ఆ విధంగా అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆదేశించారు. స్వచ్ఛమైన ఓటర్ లిస్ట్ తయారు చేయడానికి అందరూ సహకరించాలని కోరారు.ఈ సమావేశాన్ని ఉద్దేశించి డిఆర్ఓ వెంకటనారాయణమ్మ మరియు ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ మురళి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎస్ఐఆర్ ప్రక్రియలో పాటించవలసిన పద్ధతులు , తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేసి అధికారుల సందేహాలను నివృత్తి చేశారు.ఈ సమావేశం కు పాణ్యం ఎన్నికల అధికారి జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ , వీఆర్వో వెంకటనారాయణమ్మ , కర్నూలు, పత్తికొండ , కోడుమూరు,



ఎమ్మిగనూరు , మంత్రాలయం , ఆదోని , ఆలూరు ఈ ఆర్ ఓ లు చల్లా ఓబులేసు , చిన్న ఓబులేసు , సందీప్ కుమార్, అనురాధ , మధుసూదన్ రెడ్డి రామసుబ్బయ్య లు, అడిషనల్ కమిషనర్ కృష్ణ , ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ మురళి జిల్లా లోని తాహసీల్దారులు పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధిపై మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇంచార్జిల సమావేశం



**కర్నూలు** : కర్నూలు జిల్లా అభివృద్ధిపై జిల్లా ఇంచార్జి మంత్రి నిమ్మల రామా నాయుడు, మంత్రి టీజీ భరత్ గుప్తా జిల్లా నాయకులతో సమావేశం నిర్వహించారు. విజయవాడలోని జలమండలి కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు, పత్తికొండ ఎమ్మెల్యే కె.ఈ శ్యాంబాబు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయ నాగేశ్వర్ రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, ప్రధాన కార్యదర్శి నాగరాజు యాదవ్, ఆదోని ఇంచార్జి మీనాక్షి నాయుడు, మంత్రాలయం ఇన్చార్జి రాఘవేంద్ర రెడ్డి, ఆలూరు ఇన్చార్జి వైకుంఠం జ్యోతి పాల్గొన్నారు. సమావేశంలో ప్రధానంగా జిల్లా అభివృద్ధిపై చర్చించారు.

# ఈఎన్సీ మోహన్‌నాయక్ అక్రమాస్తులు రూ.150 కోట్లు!

**రిమాండ్‌కు తరలించిన పోలీసులు**

**రూ.17.94 కోట్ల అక్రమాస్తులతో చిక్కిన**

**ఆర్అండ్‌బీ ఈఎన్సీ మోహన్‌నాయక్**

**బహిరంగ మార్కెట్‌లో విలువ రూ.150 కోట్లు**

**ఉంటుందని అంచనా**

**అరెస్టు చేసిన జైలుకు తరలించిన పోలీసులు**





మిలమిల మెరుస్తున్న బంగారు బిస్కెట్లు! కళ్లు చెదిరేలా బ్యాంకు బ్యాలెన్స్! కట్టలు కట్టలుగా కరెన్సీ నోట్లు! గుట్టలుగుట్టలుగా అక్రమంగా సంపాదించిన దస్త్రాలు! గలగలలాడే విదేశీ మద్యం బాటిళ్లు! ఇవీ రోడ్లు, భవనాల శాఖలో ఈఎన్సీ మోహన్‌నాయక్ నివాసాల్లో ఏసీబీ కంట పడిన దృశ్యాలు. దాదాపు రూ.17.94 కోట్ల ఆదాయానికి మించిన ఆస్తుల్ని గుర్తించిన ఏసీబీ మోహన్‌నాయక్‌ను అరెస్ట్ చేసింది. బహిరంగ మార్కెట్లో ఆ ఆస్తుల విలువ దాదాపు రూ.150 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. రహదారులు, భవనాలశాఖ ఇంజినీర్ ఇన్‌చీఫ్ మోహన్‌నాయక్ ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అడ్డంగా దొరికిపోయారు. ఏసీబీ అధికారులు మంగళవారం ఏకకాలంలో 16 ప్రాంతాల్లో నిర్వహించిన సోదాల్లో మోహన్‌నాయక్ అవినీతి విశ్వరూపం బయటపడింది. హైదరాబాద్, నిజామాబాద్‌లోని ఆయన బంధువులు, సన్నిహితులు, బినామీల ఇళ్లతోపాటు ఈఎన్సీ కార్యాలయంలోనూ ఏసీబీ బృందాలు సోదాలు నిర్వహించాయి. పలు స్థిరాస్తులకు సంబంధించిన పత్రాల్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ మియాపూర్‌లో రెండున్నర కోట్ల విలువైన లగ్జరీ విల్లాతో పాటు, కూకట్‌పల్లిలో రూ.62 లక్షల విలువైన ఇల్లు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. గచ్చిబౌలి ఐటీ కారిడార్ పరిధిలో 4 ఫ్లాట్లు, కొంపల్లిలో 3 ఫ్లాట్లను ఏసీబీ స్వాధీనం చేసుకుంది. ఇవే కాకుండా, నిజామాబాద్ జిల్లా ముల్లంగి గ్రామంలో రూ.83 లక్షల విలువైన 19.38 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు తనిఖీల్లో తేల్చారు. ఇవే కాకుండా మోహన్‌నాయక్ ఇంట్లో రూ.55 లక్షల నగదును సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. వివిధ బ్యాంకు ఖాతాల్లో మరో రూ.కోటి 44 లక్షల నగదు ఉన్నట్లు గుర్తించారు. ఇంట్లో దాచి ఉంచిన రెండున్నర కిలోల బంగారు ఆభరణాలు, 6 కిలోల వెండి వస్తువులను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం కులాస్‌పూర్ తండాకు చెందిన మోహన్‌నాయక్ 29 ఏళ్ల క్రితం ప్రభుత్వ ఉద్యోగంలో చేరి రోడ్లు, భవనాలశాఖలో కీలక స్థానాల్లో కొనసాగారు. నల్గొండ, నిజామాబాద్‌లలో ఎస్ఈగా పనిచేయడంతో పాటు హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్లోనూ బాధ్యతలు నిర్వర్తించారు. సీఈగా ఉంటూ గతేడాది ఆగస్టులో రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా నియమితులై నెల రోజుల వ్యవధిలోనే ఈఎన్సీగా అత్యున్నత స్థానానికి చేరారు. ఆర్అండ్‌బీ శాఖలో కోట్లలో చేపట్టిన పనుల్లో వాటాలు దండుకోవడంలో మోహన్‌నాయక్ ఆరితేరినట్లు ప్రస్తుతం చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రహదారుల బిల్లుల మంజూరులో చేతివాటం ప్రదర్శించి ఉంటారనే ప్రచారం నెలకొంది. ఇటీవల జరిగిన హ్యామ్ రోడ్ల టెండర్లలోనూ తెర వెనుక చక్రం తిప్పినట్లు ఆయనపై పెద్ద ఎత్తున విమర్శలు ఉన్నాయి. ఆదాయానికి మించి విపరీతంగా ఆస్తులు కూడబెట్టిన మోహన్ నాయక్‌పై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఇవాళ న్యాయమూర్తి ముందు హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలపై మోహన్‌నాయక్ నివాసం, కార్యాలయాల్లో అవినీతి నిరోధక శాఖకు చెందిన అనేక అనేక బృందాలు సోదాలు నిర్వహించాయని ఏసీబీ జాయింట్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. హైదరాబాద్‌తోపాటు నిజామాబాద్‌లోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేశామని వెల్లడించారు. నగదు, బంగారం, వెండి ఆభరమాలను సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఆస్తుల పత్రాలు కూడా గుర్తించామని తెలిపారు.

# వర్షానికి తెగిపడిన కరెంట్ వైర్

**విద్యుత్ షాక్‌తో రెండు నిండు ప్రాణాలు బలి**

**వీధిదీపం తీగ తెగిపడడంతో విద్యుదాఘాతం**

**హైదరాబాద్ పాతబస్తీలో దుర్ఘటన**

**ఆటో డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్న మృతుడు మహ్మద్ అఫ్రోజ్**

**9వ తరగతి చదువుతున్న మరో మృతుడు జాఫర్**



మంగళవారం హైదరాబాద్ నగరంలో గాలిదుమారంతో కురిసిన భారీ వర్షం నిండుప్రాణాలను బలిగొంది. తెగిపడిన విద్యుత్ తీగ కారణంగా షాక్‌కు గురై ఇద్దరు మృతి చెందారు. ఈ దుర్ఘటన హైదరాబాద్ పాతబస్తీలో జరిగింది. పోలీసు ఇన్‌స్పెక్టర్ ఆర్.దేవేందర్, ప్రత్యక్ష సాక్షుల వివరాల ప్రకారం బండ్లగూడ పోలీసుస్టేషన్ పరిధిలోని జహంగీరాబాద్‌కు చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ అఫ్రోజ్ (30), తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి మహ్మద్ జాఫర్ (15) ఒకే వీధిలో నివాసం ఉంటున్నారు. మంగళవారం సాయంత్రం చల్లని వాతావరణం ఉండగా హోటల్ నుంచి చాయ్ తీసుకురావాలని తల్లి ఖాజాబీ కోరడంతో మహ్మద్ అఫ్రోజ్ తన ఆటోలో జాఫర్‌ను ఎక్కించుకుని రాయల్ సీ హోటల్ వద్దకు వెళ్లాడు. అప్పటికే అక్కడి హైమాస్ట్ స్ట్రీట్ లైట్ స్తంభంపై ఉన్న తీగ భారీ వర్షానికి తెగి కింద పడింది. సమీపంలోని మ్యాన్‌హోల్ నుంచి నీరు ప్రవహిస్తుండడంతో ఆ ప్రాంతం పూర్తిగా వరదమయంగా మారింది. తీగ తెగిపడిన సమాచారాన్ని హోటల్ యజమాని జహంగీర్ స్థానిక మజ్లిస్ నాయకుడి ద్వారా విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేశాడు. సంఘటన స్థలంలోకి ఎవరూ వెళ్లవద్దంటూ అందరినీ సమాచారం ఇస్తూ హెచ్చరిస్తుండగానే అఫ్రోజ్, జాఫర్‌లు వచ్చిన ఆటో అక్కడే ఆగింది. వీరిని చూసిన అందరూ రావొద్దంటూ భారీగా కేకలు పెట్టినా వర్షం కురుస్తున్న శబ్దానికి వారికి ఏం అర్థం కాలేదు. అందరూ చూస్తుండగానే ఆటోలోంచి కిందకు దిగిన జాఫర్ కరెంట్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే అతడిని కాపాడబోయిన అఫ్రోజ్ కూడా విద్యుదాఘాతానికి గురయ్యాడు. అఫ్రోజ్ అక్కడే మృతిచెందగా జాఫర్‌ను హస్పిటల్‌కు తరలిస్తుండగా కన్నుమూశాడు. తీగ ప్రమాదంగా ఉందని రెండు రోజుల కిందటే జీహెచ్ఎంసీ ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటూ పలువురు స్థానికులు ఆరోపించారు. జాఫర్ తండ్రి మహ్మద్ అశ్వాక్ స్థానికంగా సెంట్రింగ్ పనిచేస్తుంటాడు. ఇతని సంతానం ఇద్దరు కూతుళ్లు, కుమారుడు జాఫర్. ఒక్కగానొక్క కుమారుడు చనిపోవడంతో కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు ఆకాశాన్నంటాయి, వారంతా శోకసంద్రంలో మునిగిపోయారు. వివాహితుడైన మహ్మద్ అఫ్రోజ్‌కు ముగ్గురు సంతానం. ఆటో నడుపుతూ రోజువారి జీవించేవాడు. సంఘటన స్థలంలో అతడి మృతదేహాన్ని చూసి తన తల్లి గుండెలవిసేలా రోదించడం చూసేవాళ్లను తీవ్రంగా కలచివేసింది.

# ఇరాన్‌లో చిక్కుకున్న ఉత్తరాంధ్ర యువకులు

**ఆహారం, నీరు లేక నౌకలోనే నరకయాతన**

**పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్‌లో చిక్కుకుపోయిన యువకులు**

**బందర్ అబ్బాస్ పోర్టు సమీపంలో నిలిచిపోయిన నౌక**

**అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్న కుటుంబ సభ్యులు**



పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్‌లోని తీర ప్రాంతంలో ఉత్తరాంధ్రకు చెందిన పలువురు యువకులు చిక్కుకుపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెలల తరబడి నౌకలోనే ఉండిపోవాల్సి వస్తోందని, సరైన ఆహారం, తాగునీరు కూడా అందక నరకయాతన అనుభవిస్తున్నామని వారు వీడియో ద్వారా తమ కుటుంబ సభ్యులకు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన వారి బంధువులను ఆందోళనకు గురిచేస్తోంది. విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం చింతపల్లి పంచాయతీకి చెందిన కొమర సోమరాజు ప్రస్తుతం 'ఎంవీ పాస్కల్' అనే నౌకలో ట్రైనీ వైపర్‌గా పనిచేస్తున్నారు. పశ్చిమాసియా ప్రాంతంలో నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా ఇరాన్‌లోని బందర్ అబ్బాస్ పోర్టు సమీప యాంకరేజ్ ప్రాంతంలో ఈ నౌక నిలిచిపోయింది. దీంతో సిబ్బంది బయటకు రావడానికి, స్వదేశాలకు చేరుకోవడానికి ఎటువంటి అవకాశాలు లేకుండా పోయాయి. ఎంవీ పాస్కల్ నౌకలో మొత్తం 13 మంది సిబ్బంది ఉన్నారు. వారిలో నలుగురు విదేశీయులు కాగా, మిగిలిన వారు భారతీయులు. ఉత్తరాంధ్రకు చెందిన కొమర సోమరాజుతో పాటు శ్రీకాకుళం జిల్లా శ్రీకూర్మానికి చెందిన జెర్రి విష్ణు, ఆమదాలవలసకు చెందిన దుర్గాప్రసాద్, పరిపతివానిపేటకు చెందిన పరపతి రమణ కూడా అక్కడే చిక్కుకుపోయారు. తమ పరిస్థితి రోజురోజుకూ దారుణంగా మారుతోందని వారు వీడియో ద్వారా తమ ఆవేదనను వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, వీరంతా ముంబయిలోని ఓ ఏజెంట్ ద్వారా ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లారు. ఒక్కొక్కరి నుంచి సుమారు రూ.5 లక్షల వరకు వసూలు చేసినట్లు ఆరోపిస్తున్నారు. అయితే ఆరు నెలల ఒప్పందం పూర్తయినప్పటికీ యాజమాన్యం వారిని స్వదేశాలకు పంపే చర్యలు చేపట్టలేదని బాధిత కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. నౌక యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా దాదాపు నాలుగు నుంచి అయిదు నెలలుగా సరైన ఆహారం, తాగునీరు కూడా అందడం లేదని బాధితులు చెబుతున్నారు. మరోవైపు, కొమర సోమరాజుకు గత 12 నెలలుగా జీతం కూడా చెల్లించలేదని ఆయన తల్లిదండ్రులు వాపోతున్నారు. తమ పిల్లల ప్రాణాలకు ముప్పు వాటిల్లే పరిస్థితి నెలకొన్నందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి వారిని సురక్షితంగా స్వదేశానికి తీసుకురావాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు. బాధిత యువకులు పంపిన వీడియోలు ప్రస్తుతం కుటుంబ సభ్యుల మధ్య తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. యుద్ధ ప్రభావిత ప్రాంతంలో చిక్కుకున్న తమ వారిని కాపాడాలని, స్వదేశానికి తీసుకురావాలని, విదేశాంగ శాఖ తక్షణమే జోక్యం చేసుకోవాలని కుటుంబాలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాయి. పరిస్థితిపై అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కూడా కోరుతున్నారు.

# పెద్దపల్లిలో తప్పిన పెను ప్రమాదం

**త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డ రైల్వే కార్మికులు**

**పెద్దపల్లి సమీపంలో పట్టాలు తప్పిన రైల్వే ట్రాక్ యంత్రం**



తెలంగాణలోని పెద్దపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు చేపడుతుండగా, ఓ ట్రాక్ మెయింటెనెన్స్ మెషిన్ అకస్మాత్తుగా పట్టాలు తప్పింది. అక్కడే ఉన్న సిబ్బంది అప్రమత్తమై పక్కకు పరుగులు తీయడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. ఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి స్టేషన్ సమీపంలో రైల్వే సిబ్బంది పట్టాల తనిఖీ, మరమ్మతు పనుల్లో నిమగ్నమై ఉన్నారు. నలుగురైదుగురు సిబ్బంది ప్రయాణించేలా ఉండే ఈ ట్రాక్ తనిఖీ యంత్రం హఠాత్తుగా అదుపుతప్పి కార్మికుల వైపు దూసుకువచ్చింది. ప్రమాదాన్ని పసిగట్టిన సిబ్బంది తక్షణమే పక్కకు తప్పుకోవడంతో ముప్పు తప్పింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. అయితే, ఈ ప్రమాదం కారణంగా రైల్వే ట్రాక్ గణనీయంగా దెబ్బతింది. సమాచారం అందుకున్న వెంటనే ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. యంత్రం పట్టాలు తప్పడానికి గల కారణాలను విశ్లేషించేందుకు ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించారు. ప్రస్తుతం దెబ్బతిన్న ట్రాక్‌కు యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు నిర్వహిస్తున్నామని, దీనివల్ల రైళ్ల రాకపోకలకు స్వల్ప అంతరాయం కలిగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

# మల్కాజ్‌గిరిలో కాల్పుల కలకలం

**అనుమానంతో భార్యను తుపాకీతో కాల్చి చంపిన భర్త**

**భార్యను తుపాకీతో కాల్చి చంపిన రియల్టర్ కుమార్**

**తుపాకీ శబ్దం విని పోలీసులకు సమాచారం ఇచ్చిన స్థానికులు**

**మొదటి భార్యకు విడాకులు ఇచ్చి ఆమె సోదరితో ప్రేమ పెళ్లి**



హైదరాబాద్ మల్కాజ్‌గిరి పరిధి మారుతినగర్‌లో దారుణం జరిగింది. స్థిరాస్తి వ్యాపారి కుమార్ తన రెండో భార్య నిషారాణిపై అనుమానంతో తుపాకీతో కాల్చి చంపాడు. కాల్పుల శబ్దాలు విని భయాందోళనకు గురైన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీలులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అయితే నిందితుడు 3 నెలల క్రితం వాహన తనిఖీల్లో తుపాకీతో పట్టుబడడంతో అంబర్‌పేట పోలీసులు దానిని సీజ్ చేశారు. అయినా కూడా కుమార్ మరో తుపాకీ కొనుగోలు చేసి నిషారాణిపై ఈరోజు తెల్లవారుజామున 2 రౌండ్ల కాల్పులు జరిపి కిరాతకంగా హత్య చేశాడు. గతంలో కుమార్‌ను మొదటి భార్య వదిలి వెళ్లిపోవడంతో ఆమె చెల్లెలు నిషారాణిని ప్రేమ పెళ్లి చేసుకున్నాడని బంధువులు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## వాహనాల తనిఖీ, పోలీసులపై గంజాయి ముఠా రాళ్లదాడి

**అప్రమత్తమై కాల్పులు జరిపిన ఎస్సై**

**గంజాయితో పరారవుతున్న నలుగురుని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**పట్టుబడిన వారిలో ఆంధ్రా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ వాసులు**

**మొత్తం 209 కేజీల గంజాయిని సీజ్ చేసిన అధికారులు**



అల్లూరి జిల్లా అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి స్మగ్లర్ల పై పోలీసుల కాల్పులు కలకలం సృష్టించింది. ఒడిశా నుంచి చింతపల్లి మండలం లోతు గడ్డ మీదుగా వెళుతున్న గంజాయి ముఠా వాహనాలను పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో గంజాయ్ స్మగ్లర్లు రాళ్లతో పోలీసులపై దాడులకు ప్రయత్నం చేశారు. దాంతో హెడ్ కానిస్టేబుల్ తప్పించుకున్నారు. నిందితులు హెడ్ కానిస్టేబుల్ కాలర్ పట్టుకుని దాడికి యత్నిస్తుండగా ఎస్సై సాయిరాం గాల్లో రెండు రౌండ్లు కాల్పులు జరిపారు. దాంతో స్మగ్లర్లు వాహనాలు వదిలి పారిపోతుండగా పోలీసులు వెంటపడి అదుపులో తీసుకున్నారు. మొత్తం 209 కిలోల గంజాయితోపాటు ఓ కారు, రెండు బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రకు చెందిన ముఠా ఉంది. ఒడిశా నుంచి ఆంధ్ర మీదుగా గంజాయ్ తరలిస్తుండగా పట్టుకున్నామని ఎస్ఐ సాయిరాం ఈ సందర్భంగా వెల్లడించారు. చింతపల్లి మండలం అన్నవరం స్టేషన్ పరిధిలో లోతుగడ్డ సమీపంలో ముందస్తు సమాచారంతో పోలీసు అధికారులు తనిఖీలను నిర్వహిస్తున్నారు. బుధవారం తెల్లవారుజామున పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో గంజాయితో వస్తున్న కారును తనిఖీ చేస్తున్న క్రమంలో గంజాయి ముఠా పోలీసులపై రాళ్లతో దాడి చేసింది. ఈ దాడిలో హెడ్ కానిస్టేబుల్ కాలర్ కాలర్ పట్టుకున్నారు. అప్రమత్తమైన ఎస్సై గాలిలోకి కాల్పులు జరపడంతో స్మగ్లర్లు వెనక్కి తగ్గారు. వారు పరారవుతుండగా నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## స్టీల్ ప్లాంట్ ప్రమాదానికి ఎంట్రాప్డ్ గ్యాసెసే కారణం!

**నిపుణుల కమిటీ ప్రాథమికంగా అంచనా**

**వాయువులు హఠాత్తుగా విడుదల కావడంతోనే లాడిల్‌లో పేలుడు**

**కొద్ది క్షణాల ముందు లోపలున్న వాయువులు తీవ్ర ఒత్తిడి**



విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదానికి ఎంట్రాప్డ్ గ్యాసెస్ కారణమని నిపుణుల కమిటీ ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలుస్తోంది. ఈ వాయువులు అకస్మాత్తుగా విడుదల కావడంతోనే లాడిల్‌లో పేలుడు సంభవించిందని భావిస్తున్నారు. ప్రమాద సమయంలో 150 టన్నుల ద్రవపు ఉక్కుతో నిండిన భారీ లాడిల్‌ను ఉక్కు దిమ్మెల తయారీ కోసం క్రేన్‌తో తిప్పుతున్నారు. లాడిల్ కింది భాగంలో ఉండే స్లైడ్‌గేట్ తెరవడానికి కొద్ది క్షణాల ముందు లోపలున్న వాయువులు తీవ్ర ఒత్తిడికి గురై ఒక్కసారిగా బయటకు రావడంతో పేలుడు సంభవించి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఉక్కును తయారు చేసేటప్పుడు స్క్రాప్, ముడి ఇనుము లాంటి పదార్థాలను 15 వందల 40 నుంచి 16 వందల 30 డిగ్రీల సెల్సియస్ మధ్య కరిగిస్తారు. ఈ ప్రక్రియలో ద్రవ ఇనుమును ఉక్కుగా మార్చడానికి పెద్ద మొత్తంలో భారీ ఒత్తిడితో ఆక్సిజన్ పంపిస్తారు. ఈ ఆక్సిజన్ ద్రవపు ఇనుములోని కార్బన్, మాంగనీస్, సిలికాన్ లాంటి పదార్థాలను తెట్టుగా మార్చి వాటిని బయటకు తెస్తుంది. ఇదే సమయంలో ఆక్సిజన్ ఇనుముతో ఆక్సైడ్‌ను రూపొందిస్తుంది. వివిధ వాయువుల రూపంలో అంతర్గతంగా ఉంటుంది. వీటినే ఎంట్రాప్డ్ గ్యాసెస్ అంటారు. మరోవైపు విశాఖ ఉక్కు ప్రమాదానికి కారణాల అన్వేషణకు త్రిసభ్య కమిటీ రంగంలోకి దిగింది. కేంద్ర ఉక్కుశాఖ నియమించిన ఈ కమిటీలో బొకారో సెయిల్ డైరెక్టర్ ఇన్‌ఛార్జి ప్రియ రంజన్, సెయిల్ చీఫ్ జనరల్ మేనేజర్ జితేంద్రకుమార్, సెయిల్ విశ్రాంత సీజీఎం గోపాల్‌సింగ్ ఉన్నారు. ఈ కమిటీ మంగళవారం ప్రమాద స్థలాన్ని పరిశీలించి కేంద్ర ఉక్కుశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మతో సమావేశం అయింది. మరో రెండు రోజుల పాటు సభ్యులు విశాఖలోనే ఉండి ప్రమాద కారణాల పై ఆరా తీయనున్నారు. ఎస్ఎంఎస్-1లో జరిగిన ప్రమాద కారణంగా విశాఖ ఉక్కుకు సుమారు రూ.120 కోట్లకు పైగా నష్టం వాటిల్లి ఉండొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. యంత్రాలు, ఇతర సామగ్రి నష్టం సుమారు రూ.20 కోట్లు ఉంటుందని భావిస్తున్నారు. రోజుకు 8 వేల టన్నుల చొప్పున రెండు రోజులు ఉత్పత్తి నిలిచిపోయింది. దాని విలువ సుమారు రూ.100 కోట్లు. వీలైనంత త్వరగా మిగతా యంత్రాలను ప్రారంభించేందుకు ఉక్కు సీఎండీ కార్మికులతో మంగళవారం (నిన్న) సమావేశం నిర్వహించినట్టు సమాచారం. ప్రస్తుతం ఎస్ఎంఎస్-1లో మిషన్ 2 ఆగిపోగా మిగతా 5 మిషన్లతో పని చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

**అసలేం జరిగిందంటే**

సోమవారం నాడు విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ప్రమాదం చోటు చేసుకుంది. స్టీల్ ప్లాంట్‌లోని ఎస్ఎంఎస్-2, ఎస్టీసీ-3 హీట్ ఎఫ్‌జీలో స్టీల్ మెటల్ లిక్విడ్ ల్యాడిల్ పేలడంతో ఉక్కు ద్రవం లీకై మంటలు చెలరేగాయి. 1500 డిగ్రీల వేడితో స్టీల్ మెటల్ లిక్విడ్ ల్యాడిల్ ద్వారా ఉక్కు ద్రవాన్ని లిఫ్ట్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 8 మృతి చెందారు. ఆరుగురు కార్మికులకు తీవ్ర గాయాలు అయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది.

## కలబందతో మెరిసే అందం మీ సొంతం ఎలా వాడాలంటే



అలోవెరాలో విటమిన్లు , ఫోలిక్ యాసిడ్, కోలిన్, %బీ1, బీ2, బీ3, బీ6, బీ%12 విటమిన్లు, కాల్షియం, మెగ్నీషియం, జింక్, క్రోమియం, సెలీనియం, సోడియం, ఐరన్, పొటాషియం వంటి దాదాపు 20 రకాల ఖనిజాలు ఉంటాయి. మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇది ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. అందుకే ఆయుర్వేదంలో కలబందకు ప్రత్యేక స్థానం ఉంది. ఎన్నో వ్యాధుల నివారణకు దీనిని ఔషధంగా వినియోగిస్తారు. కాబట్టి అలోవెరా జెల్ ప్రయోజనాలు, దానిని ఎలా ఉపయోగించాలో ఇక్కడ తెలుసుకుందాం..

**అలోవెరా జెల్‌ని ముఖానికి అప్లై చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు ఇవే..**

అలోవెరా జెల్ ముఖంపై ఫైన్ లైన్స్ సమస్య నుంచి బయటపడటానికి సులభమైన పరిష్కారం. దీన్ని చేతులు, ముఖానికి అప్లై చేయడం వల్ల చర్మంలో కొల్లాజెన్ స్థాయిలు పెరిగి చర్మం మెరుస్తుంది. దీన్ని రోజూ ముఖానికి రాసుకోవడం వల్ల చర్మం మృదువుగా, ఆరోగ్యంగా మారుతుంది.

**సూర్య కిరణాల నుంచి రక్షణ**

అలోవెరా శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది. అలోవెరా జెల్‌ను ముఖానికి అప్లై చేయడం వల్ల దద్దుర్లు, ముఖం వాపు నుండి ఉపశమనం పొందవచ్చు. దీన్ని ముఖానికి అప్లై చేయడం వల్ల సూర్యకిరణాలు చర్మంపై ప్రభావం చూపవు. బయట ఎక్కువ పని చేసే వారు ఇంటికి వచ్చిన తర్వాత అలోవెరా జెల్‌ని ముఖానికి రాసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.

### గుండె జబ్బుల బారిన పడొద్దంటే

## మీ వంటలో ఈ మార్పు తప్పక చేయండి



ఈ మధ్య కాలంలో గుండె జబ్బుల మరణాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. వీటిలో చాలా మరణాలకు రక్తంలో కొవ్వు పేరుకుపోవడమే ప్రధాన కారణం అవుతోంది. మరి రక్తంలో కొవ్వు పేరుకోకూడదు అంటే మన ఆహారపు అలవాట్లలో చాలా మార్పులు చేసుకోవాలి. ముఖ్యంగా మనం వాడే వంట నూనె విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. మన ఆరోగ్యం కచ్చితంగా మనం ఇంట్లో ఏ వంట నూనె ఉపయోగిస్తున్నాం అనే దానిపై ఆధారపడి ఉంటుంది.అదేవిధంగా నూనె రకం ఏదైనా సరే దాన్ని ఎక్కువగా వినియోగించడం కూడా మన గుండె ఆరోగ్యానికి కీడు చేస్తుంది. నూనె ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల సిరల్లో చెడు కొలెస్ట్రాల్ పరిమాణం పెరుగుతుంది. దీనివల్ల ముందుగా అధిక రక్తపోటు వచ్చి ఆ తర్వాత గుండెపోటు, గుండె వైఫల్యం, కరోనరీ ఆర్టరీ డిసీజ్, ట్రిపుల్ వెస్సెల్ డిసీజ్లకు దారి తీస్తుంది. కాబట్టి మనం వంట నూనె రకంపైన మాత్రమేగాకుండా వంటల్లో వినియోగించే నూనె మోతాదు విషయంలో కూడా జాగ్రత్తగా ఉండాలి.రక్త నాళాల్లో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి కొన్ని మేలైన వంట నూనెలను మాత్రమే వినియోగించాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. నూనె విషయంలో వంటలో మార్పు చేయకపోతే అనారోగ్యాన్ని కొని తెచ్చుకున్నట్లే అవుతుందని హెచ్చరిస్తున్నారు. కొన్ని నూనెలు చెడు కొలెస్ట్రాల్‌కు చెక్ పెడతాయని, వాటిని తీసుకోవడంవల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచిస్తున్నారు. వేరుశెనగ నూనెతో కొలెస్ట్రాల్ పెరుగుతుందని అంటారు. కానీ ఇది అపోహ అని నిపుణులు అంటున్నారు.వేరుశనగ నూనెను ఉపయోగించడం ఆరోగ్యానికి మంచిది. వేరుశనగ నూనెలో విటమిన్ ఇ, ఫైటోస్టెరాల్ అధిక మొత్తంలో ఉంటాయి. అయితే అధిక రక్తపోటు, మధుమేహం లాంటి దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉన్నవాళ్లు నెలల తరబడి ఒకే నూనెను కాకుండా.. రెండు నెలలకు ఒకసారి నూనె రకాన్ని మారిస్తే బాగుంటుంది. అదేవిధంగా అవిసె గింజలలో ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి అవిసె నూనెను వంటల్లో వాడితే శరీరంలో కొలెస్ట్రాల్‌తోపాటు మంట తగ్గుతుంది. అయితే అవిసె నూనెను అధిక ఉష్ణోగ్రత వద్ద మరిగించినా, ఫ్రిజ్‌లో పెట్టి కూల్ చేసినా దాని సహజ లక్షణాన్ని కోల్పోతుంది. కాబట్టి అలాంటి పొరపాటు చేయకూడదు.ఆలివ్ నూనె కూడా ఆరోగ్యానికి చాలా మంచిది. అయితే మన దేశంలో ఆలివ్ నూనె ఉత్పత్తి తక్కువగా ఉంటుంది. దానిని మధ్యప్రాచ్యం, మధ్యధరా దేశాల నుండి దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. కాబట్టి భారత్‌లో ఆలివ్ నూనె ధర చాలా ఎక్కువగా ఉంటుంది. కానీ ఆర్థిక స్తోమతను బట్టి అరుదుగానైనా ఆలివ్ నూనెను వంటలో భాగం చేసుకోవడం ముఖ్యం. దీనిలో విటమిన్ ఎ, విటమిన్ డి, విటమిన్ ఇ, విటమిన్ కె ఉంటాయి. అంతేగాక ఇది యాంటీ ఇన్‌ఫ్లమేటరీ కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సాయపడుతుంది.

## మళ్లీ మళ్లీ పెరిగే దంతాలు



పాల దంతాలు ఊడిపోయి, వాటి స్థానంలో శాశ్వత దంతాలొస్తాయి. ఈ రెండో దంతాలు ఊడిపోతే కట్టుడు దంతాలు మినహా మరే మార్గమూ ఉండదు. కానీ తాజాగా జపాన్ శాస్త్రవేత్తలు మూడోసారి దంతాలు పెరిగే ఒక ఔషధాన్ని సృష్టించే ప్రయత్నంలో ఉన్నారు. ఆసక్తికరమైన ఈ అంశం గురించి తెలుసుకుందాం!రెండోసారి ఊడిపోయిన శాశ్వత దంతాల స్థానంలో, చిగుళ్ల నుంచి మూడో దంతాల సెట్ పెరగడం ఎలా ఉంటుందో ఒకసారి ఊహించండి. కిటానో ఆస్పత్రి మెడికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన డాక్టర్ కట్సు టకహాషి నాయకత్వంలోని పరిశోధకుల బృందం, దంతాల పెరుగుదలకు అవరోధంగా మారుతున్న యుఎస్ఎజి-1 అనే జన్యు ప్రొటీన్‌ను అడ్డుకునే ఔషధాన్ని అభివృద్ధి చేసింది. ఎలుకల మీద చేపట్టిన ప్రయోగాల్లో, ఈ ప్రొటీన్‌ను అణచివేయడం ద్వారా, కొత్త దంతాల పెరుగుదల విజయవంతంగా ఊపందుకోవడాన్ని పరిశోధకులు కనిపెట్టారు. 2013 నాటికి ఈ చికిత్సను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో, మనుషుల మీద కూడా ఈ ప్రయోగాలను చేపట్టడానికి పరిశోధకులు సిద్ధపడుతున్నారు. ఈ ప్రయోగం విజయవంతమైతే, ఎన్నో కోట్ల మందికి మూడవ దంతాల సెట్ ప్రయోజనం దక్కుతుంది. దశాబ్దాల పునరుత్పాదక పరిశోధన ఆధారంగా నిర్మితమైన సైన్స్... షార్కులు, ఏనుగుల మాదిరిగానే మనుషులు కూడా సహజసిద్ధంగా పెరిగే బహుళ దంతాల సెట్‌ను కలిగి ఉంటారని పరిశోధకులు నమ్ముతున్నారు. డెంటల్ పల్ప్, ఎముకల పునరుత్పాదకతలో కొనసాగుతున్న అభివృద్ధి ఆధారంగా... జన్యుపరమైన కారణాల రీత్యా, ప్రమాదాల్లో, లేదా వార్ధక్యంతో కోల్పోయిన దంతాలను తిరిగి మొలిపించుకునే వీలు కలుగుతుందని పరిశోధకులు అంటున్నారు.

# మొండి పుండ్లకు జెల్ చికిత్స!

# తాజా అధ్యయనంలో కీలక విషయాలు!

### పుండు మానడంలో ఆక్సిజన్‌ది కీలక పాత్ర

### పరిశోధకులు ఏం చెప్తున్నారంటే!



ఎంతకీ మానని మొండి పుండ్లు పెద్ద సమస్య. వీటికి చికిత్స చేయటం చాలా కష్టం. ఒకవేళ పుండ్లు మానకపోతే పాదాలు, వేళ్లు తొలగించాల్సిన పరిస్థితీ తలెత్తుతుంది. రోజు రోజుకీ వృద్ధులు, డయాబెటిస్ బాధితుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో మొండి పుండ్ల కొత్త చికిత్సలకూ ప్రాధాన్యం ఏర్పడుతోంది. దీని విషయంలో యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, రివర్‌సైడ్ రూపొందించిన జెల్ పట్టీ వ్యవస్థ కొత్త ఆశలు రేపుతోంది. గాయమైన చోట లేదా పుండ్లు ఉన్న చోట నిరంతరం ఆక్సిజన్ సరఫరా చేయటం ద్వారా పుండ్లు మానేలా చేయటం దీని ప్రత్యేకత. మరి, అదెలాగో ఇప్పుడు తెలుసుకుందాం!

**ఆక్సిజన్ పాత్ర :** మాములుగా నాలుగు వారాల్లోపు నయం కాని పుండ్లను మొండిపుండ్లుగా భావిస్తుంటారు. ఈ రకం పుండ్లు నెలల కొద్దీ మానకుండా వేధిస్తుంటాయి. వీటితో ఇన్‌ఫెక్షన్ ఎక్కువ కావటం, హాస్పిటల్‌లో చేరాల్సి రావటం వంటి జరుగుతుంటాయి. కొన్ని సార్లు కాళ్లూ, చేతుల వంటివి తొలగించాల్సిన పరిస్థితీ కూడా ఏర్పడుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ఏటా సుమారు 1.2 కోట్ల మంది మొండి పుండ్ల బారినపడుతున్నారని నివేదికలు అంచనా వేస్తున్నాయి. వీరిలో సుమారు 20 శాతం మందికి పాదాలు, వేళ్ల వంటివి తొలగించాల్సిన పరిస్థితి తలెత్తుతుందని పేర్కొన్నాయి. పుండ్లు మానకపోవటానికి ఒక ప్రధాన కారణం.. ఆ భాగానికి తగినంతగా, స్థిరంగా ఆక్సిజన్ అందకపోవటమే అంటున్నారు నిపుణులు.సాధారణంగా పుండు 4 దశలు ద్వారా మానుతుం టున్నారు నిపుణులు. ముందు వాపు ప్రక్రియ తలెత్తుతుందని, ఆ తర్వాత కొత్త రక్తనాళాలు పుట్టుకొస్తాయని పేర్కొంటున్నారు. అనంతరం కణజాలం తిరిగి కుదురుకుంటుందని తెలియజేస్తున్నారు. ఆఖరికి కొత్త కణజాలం ఏర్పడుతుందని వివరిస్తున్నారు. ఈ క్రమంలో అన్ని దశల్లోనూ ఆక్సిజన్ పాత్ర కీలకమంటున్నారు. ఆక్సిజన్ తగినంత అందకపోతే వాపు ప్రక్రియ ఎక్కువ కాలం కొనసాగుతుందని చెబుతున్నారు. ఇది బ్యాక్టీరియా వృద్ధి చెందటానికి, ఇన్‌ఫెక్షన్ తలెత్తటానికి అనువైన వాతావరణం కల్పిస్తుందని తెలియజేస్తున్నారు. మరోవైపు కణజాలం తిరిగి కోలుకునే ప్రక్రియ కూడా నిలిచిపోతుందని వెల్లడిస్తున్నారు. దెబ్బతిన్న కణజాలం లోతుల్లోకి ఆక్సిజన్ చేరకపోతే మరింత సమస్యంగా మారుతుందని హెచ్చరిస్తున్నారు. దీన్ని పరిష్కరించటానికే ఖజ= పరిశోధకులు కొత్త జెల్ వ్యవస్థను రూపొందించారు. మెత్తగా, మృదువుగా ఉండే ఇది గాయమైన భాగం వద్దే నిరంతరం నేరుగా ఆక్సిజన్‌ను సృష్టిస్తుందంటున్నారు పరిశోధకులు.

**ఎలా పనిచేస్తుంది :** జెల్ పట్టీలో నీరు, కొలిన్ ఆధారిత ద్రవం ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు. యాంటీ బ్యాక్టీరియా గుణం గల కొలిన్ ఆధారిత ద్రవం సురక్షితమైందని, తనకు తానే క్షీణిస్తుందని అంటున్నారు. వినికిడి సాధనాల్లో ఉండేటువంటి చిన్న బ్యాటరీతో అనుసంధానమైనప్పుడు ఈ వ్యవస్థ చిన్న విద్యుత్ రసాయన పరికరంగా మారుతుందని పేర్కొంటున్నారు. అప్పుడు నీటి అణువులు విడిపోయి నెమ్మదిగా, అవసరమైనంత మేరకు ఆక్సిజన్ పుట్టుకొస్తూ ఉంటుందని వివరిస్తున్నారు. ద్రవాలను పీల్చుకునే లేదా యాంటీ మైక్రోబియల్ పదార్థాలతో కూడిన సంప్రదాయ పుండ్ల పట్టీల మాదిరిగా కాకుండా ఇది ఆక్సిజన్ లేమి సమస్యను పరిష్కరించటం ద్వారా పనిచేస్తుందని తెలియజేస్తున్నారు. ముందుగా పుండు ఆకారాన్ని కచ్చితంగా మార్చి, ఆక్సిజన్ మోతాదులు తక్కువగా ఉన్నచోట పగుళ్లను పూడ్చివేస్తుందని చెబుతున్నారు. దీంతో ఇన్‌ఫెక్షన్ ముప్పు గణనీయంగా తగ్గుతుందని అంటున్నారు. నిరంతరం ఆక్సిజన్ సరఫరా కావటం వల్ల రక్తనాళాలూ త్వరగా పుట్టుకొస్తాయని, ఫలితంగా పుండు వేగంగా మానుతుందని సూచిస్తున్నారు.

**ఆశాజనక ఫలితాలు :** వినూత్న జెల్ పట్టీని డయాబెటిస్ గల, వృద్ధ ఎలుకల మీద ప్రయోగించి, పరిశీలించారు పరిశోధకులు. ఎందుకంటే, వీటి పుండ్లు వృద్ధుల్లో తలెత్తే దీర్ఘకాల పుండ్లనే పోలి ఉన్నాయంటున్నారు. చికిత్స చేయకపోతే పుండు మానదని, ప్రాణాంతకంగానూ పరిణమిస్తుందని హెచ్చరిస్తున్నారు. అందుకే, ఎలుకలకు వారానికి ఒకోసారి పట్టీని మార్చుతూ, సుమారు 23 రోజుల పాటు చికిత్స చేశారని వివరిస్తున్నారు. అన్నీ జీవించి ఉన్నాయని తెలియజేస్తున్నారు. తద్వారా పట్టీ మంచి ఫలితం చూపుతున్నట్టు దీని ద్వారా రుజువైందని చెబుతున్నారు. ల్యాబ్‌లో కణజాలాలు, అవయవాలను వృద్ధి చేయటంలోనూ ఆక్సిజన్, పోషకాలు అందేలా చూడటం కీలకమంటున్నారు. ఇలాంటి వాటికీ జెల్ పట్టీ ఉపయోగపడగలదని భావిస్తున్నారు.

# గ్రీన్ టీతో మెదడు చురుకుదనం



గ్రీన్ టీ ఆరోగ్యకరం అనే విషయం మనందరికీ తెలిసిందే! అయితే గ్రీన్ టీలోని సహజసిద్ధ మూలకాలు అల్జీమర్స్ నుంచి మెదడుకు రక్షణ కల్పిస్తాయనే ఒక అధ్యయనం తాజాగా వెలుగులోకొచ్చింది.గ్రీన్ టీలోని నికోటినమైడ్, ఎపిగాలోక్టేకిన్ గాలేట్ అనే రెండు సహజసిద్ధ మూలకాలు మెదడులోని పాత కణాలు కొత్త వాటిలా చురుగ్గా పని చేసేందుకు దోహదపడతాయని క్యాలిఫోర్నియా విశ్వవిద్యాలయ పరిశోధకులు కనిపెట్టారు. ఈ రెండు మూలకాలు, నష్ట నివారణలో తోడ్పడే జిటిపి అనే కీలక శక్తి అణువులను పునరుద్ధరిస్తాయని వారు పేర్కొంటున్నారు. ఈ ప్రయోగాన్ని వయసు పైబడిన ఎలుకల మీద చేపట్టినప్పుడు, అల్జీమర్స్ వ్యాధితో ముడిపడి ఉన్న అమైలాయిడ్ బీటా అనే ప్రొటీన్ మోతాదు తగ్గడాన్ని పరిశోధకులు గుర్తించారు. సాధారణంగా మనుషులకు వయసు పైబడినప్పుడు, మెదడు కణాలు శక్తిని కోల్పోతూ ఉంటాయి. ఆ కణాలను గ్రీన్ టీలోని రెండు సహజసిద్ధ మూలకాలతో చికిత్స చేసినప్పుడు, కేవలం 24 గంటల్లోనే, శక్తిమోతాదులు పెరిగి, మెదడులో 'ఆటోఫజీ' ఊపందుకుంటోంది. ఈ చికిత్స ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను కూడా తగ్గిస్తుంది. గతంలో అల్జీమర్స్ పరిశోధనల్లో, మెదడు కణాలను ఆరోగ్యంగా ఉంచడంలో జిటిపి పాత్రకున్న ప్రాధాన్యాన్ని పరిశోధకులు పెద్దగా పట్టించుకోలేదు. తాజా అధ్యయనంలో వాటిని బలపరుచుకునే మార్గం తెలిసింది కాబట్టి గ్రీన్ టీతో మెదడు కణాలను ఆరోగ్యంగా ఉంచుకోవడం ద్వారా అల్జీమర్స్‌కు అడ్డుకట్ట వేయగలిగే మార్గం సుగమం అయింది.

# మీ గట్ హెల్త్ బాగుండాలా

### ఆహారంలో వీటిని చేర్చుకుంటే

### మేలంటున్న నిపుణులు!

### జీర్ణ సంబంధిత సమస్యలు దూరం

### చేసుకోవాలా

### ఫైబర్ ఉన్న ఆహారాలు మేలు చేస్తాయట!

### ఎందుకో వివరిస్తోన్న నిపుణులు!



మంచి జీర్ణక్రియ, రోగనిరోధక శక్తి, మానసిక స్థితి, మెటబాలిజం వంటి అంశాలలో గట్ హెల్త్ కీలక పాత్ర పోషిస్తుంది. అది ఆరోగ్యంగా ఉండాలంటే తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు తినాల్సిందే. అయితే వీటితో పాటు కొంచెం పీచు పదార్థాలు తింటే గట్ ఆరోగ్యం మరింత బాగుంటుందంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో ఎలాంటి ఆహార పదార్థాలు తీసుకుంటే గట్ హెల్త్‌కు మంచిదో ఇప్పుడు తెలుసుకుందాం!

**దోరగా ఉన్న అరటిపండ్లు :** అరటిపండ్లు, ముఖ్యంగా కొంచెం పచ్చగా ఉన్నవి, 'రెసిస్టెంట్ స్టార్చ్' అనే పీచు పదార్థాన్ని కలిగి ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇది ఒక ప్రీ బయోటిక్ వలె పనిచేస్తుందని తెలియజేస్తున్నారు. అంటే, ఇది జీర్ణవ్యవస్థలోని మంచి బ్యాక్టీరియాకు ఆహారాన్ని అందిస్తుందని పేర్కొంటున్నారు. అలాగే, రక్తంలోని చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడానికి, కడుపు నిండుగా ఉన్న అనుభూతిని కలిగించడానికి, జీర్ణక్రియ సజావుగా సాగడానికి సహాయపడుతుందని వివరిస్తున్నారు.

**చియా గింజలు :** చియా గింజలు పరిమాణంలో చిన్నవైనప్పటికీ, పోషకాల పరంగా చాలా శక్తివంతమైనవి. వీటిలో కరిగే పీచు పదార్థం అధికంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇది పేగుల్లో జెల్ వంటి పదార్థాన్ని ఏర్పరుస్తుందంటున్నారు.తద్వారా జీర్ణక్రియను నెమ్మదింపజేయడానికి, రక్తంలోని చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడానికి సహాయపడుతుందని తెలియజేస్తున్నారు. ఈ క్రమంలో రోజుకు ఒకటి లేదా రెండు టేబుల్ స్పూన్ల చియా గింజలను పెరుగులో కలుపుకొని గానీ, రాత్రంతా నానబెట్టి గానీ లేదా స్మూతీస్‌లో కలిపి గానీ తీసుకోవడం వల్ల జీర్ణక్రియ సామర్థ్యం మెరుగుపడుతుందట.

**పప్పుధాన్యాలు, లెగ్యూమ్స్ :** మన శరీరానికి కరిగే, కరగని పీచు పదార్థాలతో పాటు మొక్కల నుంచి లభించే ప్రోటీన్‌ను కూడా పప్పు దినుసులు అందిస్తాయంటున్నారు నిపుణులు. పప్పుధాన్యాలు, లెగ్యూమ్స్ విరేచనం సాఫీగా అయ్యేలా నియంత్రించడమే కాకుండా, పేగుల్లోని సూక్ష్మజీవులకు శక్తిని ఇస్తుందని చెబుతున్నారు. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి, రక్తంలోని చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడానికి కూడా తోడ్పడతాయని వివరిస్తున్నారు. ఈ క్రమంలో రోజువారీ ఆహారంలో అర కప్పు నుంచి ఒక కప్పు వరకు వండిన పప్పుధాన్యాలను చేర్చుకోవడం వల్ల శరీరానికి కావలసిన పీచు పదార్థం అందుతుందని పేర్కొంటున్నారు. లిమా బీన్స్, పచ్చి బఠానీలు, శనగలు, కిడ్నీ బీన్స్‌లో ఫైబర్ ఎక్కువగా ఉంటుందని అధ్యయనం పేర్కొంది.

**బెర్రీలు :** బెర్రీలు, ముఖ్యంగా బ్లూ బెర్రీలు, రాస్ప్‌బెర్రీలలో పీచు పదార్థంతో పాటు పాలీఫెనాల్స్ పుష్కలంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఈ పాలీఫెనాల్స్ పేగుల్లోని సూక్ష్మజీవుల వైవిధ్యాన్ని పెంచడానికి, జీర్ణవ్యవస్థలో వాపును తగ్గించడానికి సహాయపడతాయంటున్నారు. సమతుల్య ఆహారంలో భాగంగా ప్రతిరోజూ అర కప్పు నుంచి ఒక కప్పు వరకు బెర్రీలను తీసుకోవాలని సూచిస్తున్నారు.


**నట్స్ :** వాల్‌నట్స్, పిస్తా, జీడిపప్పు, బాదం పప్పులోని పీచు పదార్థం కడుపు నిండుగా ఉన్న అనుభూతిని ఇవ్వడమే కాకుండా, మెటబాలిక్ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయంటున్నారు నిపుణులు. ప్రతిరోజూ పావుకప్పు నట్స్ తీసుకోవడం వల్ల పేగుల్లోని సూక్ష్మజీవుల వైవిధ్యం పెరుగుతుందని చెబుతున్నారు. అంతేకాకుండా, వీటిని ఎక్కడికైనా సులభంగా తీసుకెళ్లవచ్చు, రోజువారీ ఆహారంలో చాలా తేలికగా చేర్చుకోవచ్చుట. పిస్తా, జీడిపప్పు, బాదం.. మన గట్ మైక్రోబయోమ్‌కు ప్రత్యేకంగా సహాయపడతాయని అధ్యయనం పేర్కొంది.పేగు ఆరోగ్యానికి పీచు పదార్థం ఎందుకు అవసరం? : జీర్ణవ్యవస్థలో సమతుల్యతను కాపాడటంలో పీచు పదార్థం కీలక పాత్ర పోషిస్తుంది. ఇది మలబద్ధకాన్ని తగ్గించడానికి, విరేచనం సాఫీగా అయ్యేలా నియంత్రించడానికి, గుండె జబ్బులు, పేగు క్యాన్సర్, టైప్ 2 డయాబెటిస్ వంటి వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. గట్ మైక్రోబయోటా వైవిధ్యాన్ని నిర్వహించడానికి ఆహారంలో ఫైబర్ కీలకమైన పోషకమని అధ్యయనం పేర్కొంది.




## నాని 'ది పారడైజ్' మళ్లీ వాయిదా? రవితేజ 'ఇరుముడి' కోసమేనా!

నాచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'ది పారడైజ్' మరోసారి వాయిదా పడే దిశగా కనిపిస్తోంది. మొదట మార్చి 26న విడుదల కావాల్సిన ఈ చిత్రం, ఆ తర్వాత ఆగస్టు 21కి వాయిదా పడిన సంగతి తెలిసిందే. అయితే, ఇప్పుడు ఆ ఆగస్టు 21వ తేదీని మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న 'ఇరుముడి' సినిమా లాక్ చేసుకోవడంతో నాని సినిమా పోస్ట్‌పోన్ కాక తప్పని పరిస్థితి ఏర్పడింది. సినిమాకు సంబంధించిన కొంత వర్క్ ఇంకా పెండింగ్‌లో ఉండటమే ఈ ఆలస్యానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. సోషల్ మీడియాలో వినిపిస్తున్న తాజా సమాచారం ప్రకారం.. 'ది పారడైజ్' చిత్రం సెప్టెంబర్ నెలలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది. అయితే, ఇది కేవలం ప్రచారం మాత్రమేనని, దీనిపై చిత్ర యూనిట్ నుండి అధికారిక ప్రకటన రావాల్సి ఉందని ఇండస్ట్రీ టాక్. బ్లాక్‌బస్టర్ 'దసరా' తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో 'ది పారడైజ్' పై భారీ అంచనాలు ఉన్నాయి. ఎస్ఎల్‌వి సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో కాయాదు లోహర్ హీరోయిన్ గా నటిస్తుండగా, కలెక్షన్ కింగ్ మోహన్ బాబు విలన్ పాత్రలో నటిస్తున్నాడు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు అనిరుధ్ రవిచందర్ సంగీతాన్ని అందిస్తున్నాడు.

## 'పెద్ది'కి మళ్లీ రిపేర్లు.. సెకండాఫ్‌లో కీలక మార్పులు, కొత్త వెర్షన్ సిద్ధం!



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లతో దూసుకుపోతున్నప్పటికీ, సినిమా కంటెంట్ విషయంలో వచ్చిన విమర్శలను మేకర్స్ సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకులు, విమర్శకుల నుంచి మిశ్రమ స్పందన వచ్చిన నేపథ్యంలో దర్శకుడు బుచ్చిబాబు సానా ఈ చిత్రాన్ని మరింత మెరుగుపరచే ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే జాన్వీ కపూర్ పాత్రకు సంబంధించిన కొన్ని సన్నివేశాలు సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలకు గురయ్యాయి. హీరోయిన్‌ను చూపించిన తీరు, కొన్ని షాట్లపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో దర్శకుడు బుచ్చిబాబు క్షమాపణలు చెబుతూ ఆ సన్నివేశాలను తొలగించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం థియేటర్లలో ఆ మార్పులతో కూడిన వెర్షన్ ప్రదర్శితమవుతోంది. అయితే తాజా సమాచారం ప్రకారం, 'పెద్ది'లో మార్పులు అక్కడితో ఆగలేదని తెలుస్తోంది. ముఖ్యంగా సెకండాఫ్ నిడివి, కథనం వేగంపై ప్రేక్షకుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను దృష్టిలో పెట్టుకుని మరిన్ని ఎడిటింగ్ మార్పులు చేయాలని చిత్రబృందం నిర్ణయించినట్లు టాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో సెకండాఫ్‌లో వచ్చే కొన్ని ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్స్‌ను తగ్గించి, వాటి స్థానంలో రామ్ చరణ్ మరియు జగపతి బాబు పాత్రల మధ్య భావోద్వేగపూరిత సన్నివేశాలను జోడించే ఆలోచనలో మేకర్స్ ఉన్నారని సమాచారం. ఈ మార్పులతో కథ మరింత బలంగా, భావోద్వేగంగా కనెక్ట్ అవుతుందని భావిస్తున్నారట. అలాగే సినిమాలోని కొన్ని నెమ్మదిగా సాగిన భాగాలను కత్తిరించి, కథనాన్ని మరింత రేసీగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ప్రేక్షకుల దృష్టిని నిలబెట్టేలా సెకండాఫ్‌ను మరింత గ్రిప్పింగ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ మార్పులు చేస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఎడిటింగ్ పనులు పూర్తయిన తర్వాత చిత్రానికి మళ్లీ సెన్సార్ అనుమతి తీసుకుని, కొత్త వెర్షన్‌ను థియేటర్లలో ప్రదర్శించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. వీలైనంత త్వరగా, ముఖ్యంగా వచ్చే వీకెండ్‌కు ముందే ఈ అప్‌డేటెడ్ వెర్షన్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే, మిశ్రమ టాక్ వచ్చినప్పటికీ 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు నమోదు చేస్తూ ముందుకు సాగుతోంది. ఇప్పుడు ఈ కొత్త మార్పులు సినిమాకు మరింత బలాన్ని చేకూరుస్తాయా? కలెక్షన్లపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయా? అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.

## దేశ విభజన నేపథ్యంలో సన్నీ డియోల్ 'బట్వారా 1947'.. విడుదల తేదీ ఖరారు!






బాలీవుడ్ యాక్షన్ స్టార్ సన్నీ డియోల్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ హిస్టారికల్ డ్రామా చిత్రం నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. ఇప్పటివరకు 'లాహోర్ 1947' అనే వర్కింగ్ టైటిల్‌తో శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా పేరును అధికారికంగా 'బట్వారా 1947' గా మారుస్తూ చిత్రబృందం సరికొత్త మోషన్ పోస్టర్‌ను విడుదల చేసింది. దేశ విభజన నాటి భయానక పరిస్థితులు, ద్వేషం మధ్య ఒక వ్యక్తి చూపించిన అసాధారణ ధైర్యం నేపథ్యంలో సాగే ఈ భావోద్వేగభరితమైన చిత్రాన్ని స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా 2026, ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. గతంలో 'ఘాయల్', 'దామిని', 'ఘాతక్' వంటి ఇండస్ట్రీ హిట్లను అందించిన స్టార్ డైరెక్టర్ రాజ్‌కుమార్ సంతోషి, సన్నీ డియోల్ కాంబినేషన్‌లో చాలా ఏళ్ల తర్వాత వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను మిస్టర్ పర్ఫెక్ట్ ఆమిర్ ఖాన్ తన 'ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండటం విశేషం. ఈ చిత్రంలో సన్నీ డియోల్ సరసన సీనియర్ స్టార్ హీరోయిన్ ప్రీతి జింతా నటిస్తుండగా, శబానా అజ్మీ, అలీ ఫజల్, కరణ్ డియోల్, కనికా కపూర్, సర్గమ్ సింగ్, ఖుషీ హజారే కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ గ్రహీత ఎ.ఆర్. రెహమాన్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు.

## వీడి అనుమానంలో మనం విడిపోయేలా ఉన్నాం'



యంగ్ హీరో రాగ్ మయూర్ నటించిన లేటెస్ట్ సైకాలాజికల్ కామెడీ ఎంటర్‌టైనర్ అనుమాన పక్షి. ఈ సినిమాకు విమల్ కృష్ణ దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని రాజీవ్ చిలకా, రాజేశ్ జగ్తియాని, హిరాచంద్ దండ్ నిర్మించారు. ఈ చిత్రంలో మెరిన్ ఫిలిప్ హీరోయిన్‌గా నటించింది. తాజాగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. తాజాగా రిలీజైన టీజర్ చూస్తుంటే ప్రతి విషయానికి అనుమానపడే వ్యక్తిగా హీరో రాగ్ మయూర్ కనిపించారు. ప్రతిదాన్ని అనుమానించే హీరో పెళ్లి విషయంలో ఏం చేశారనే నేపథ్యంలోనే ఈ మూవీని తెరకెక్కించినట్లు అర్థమవుతోంది. ఈ మూవీలో ప్రిన్స్, అనన్య, చరిత్, బ్రహ్మాజీ, రాశి, ?అజయ్ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా జూలై 10న థియేటర్లలో సందడి చేయనుంది.





## నాగ చైతన్య సూపర్ హిట్ థ్రిల్లర్ సిరీస్‌పై క్రేజీ బజ్ ..

### ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ జత కట్టిన క్రేజీ కాంబో

అక్కినేని యువ హీరో నాగ చైతన్య ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఒకవైపు భారీ థ్రిల్లర్ మూవీ 'వృష కర్మ'లో నటిస్తూనే, మరోవైపు తన కెరీర్‌లో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన ఓటీటీ సిరీస్ 'దూత' రెండో సీజన్ కోసం కూడా సిద్ధమవుతున్నారు. ఇప్పటికే అధికారికంగా ప్రారంభమైన 'దూత 2'పై రోజురోజుకు ఆసక్తికరమైన వార్తలు వెలుగులోకి వస్తున్నాయి. దర్శకుడు విక్రమ్ కె కుమార్ తెరకెక్కించిన 'దూత' తొలి సీజన్ ప్రేక్షకుల నుంచి అద్భుతమైన ఆదరణను సొంతం చేసుకుంది. హారర్, మిస్టరీ, థ్రిల్లర్ అంశాల కలయికతో రూపొందిన ఈ సిరీస్ ఓటీటీ ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా, నాగ చైతన్యకు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో మంచి గుర్తింపును తీసుకొచ్చింది. ఇప్పుడు రెండో సీజన్ మరింత భారీ స్థాయిలో తెరకెక్కనున్నట్లు సమాచారం. తాజాగా సినీ వర్గాల్లో వినిపిస్తున్న వార్తల ప్రకారం, ప్రముఖ నటి భూమిక చావ్లా 'దూత 2'లో కీలక పాత్ర పోషించనున్నారట. ఈ విషయంపై అధికారిక ప్రకటన రానప్పటికీ, భూమిక పాత్ర కథలో ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటుందని ప్రచారం జరుగుతోంది. ఒకవేళ ఈ వార్త నిజమైతే, నాగ చైతన్య-భూమిక కాంబినేషన్ మరోసారి ప్రేక్షకులను అలరించనుంది. ఇప్పటికే 2018లో వచ్చిన 'సవ్యసాచి' చిత్రంలో నాగ చైతన్యతో కలిసి నటించిన భూమిక, ఇప్పుడు 'దూత 2'లో మరో ఆసక్తికరమైన పాత్రలో కనిపించబోతున్నారని టాక్. ఆమె పాత్ర కథనంలో కీలక మలుపులకు కారణమవుతుందని కూడా సినీ వర్గాలు చెబుతున్నాయి. మొదటి సీజన్‌లో ప్రింట్ మీడియా, వార్తాపత్రికల నేపథ్యంలో సాగే భయానక మిస్టరీని దర్శకుడు విక్రమ్ కె కుమార్ అద్భుతంగా చూపించారు. జరగబోయే ఘటనలను ముందుగానే చెప్పే వార్తాపత్రికల కాన్సెప్ట్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఇప్పుడు రెండో సీజన్‌లో పూర్తిగా కొత్త కాన్సెప్ట్‌తో ప్రేక్షకులను థ్రిల్ చేయడానికి దర్శకుడు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అత్యాధునిక టెక్నాలజీ, డిజిటల్ ప్రపంచం లేదా మరొక వినూత్నమైన అంశాన్ని కథలో భాగం చేయనున్నారనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. అయితే మేకర్స్ మాత్రం కథకు సంబంధించిన వివరాలను గోప్యంగా ఉంచుతున్నారు. ఇక ఈ సిరీస్ మరో ప్రత్యేకత ఏమిటంటే, నాగ చైతన్య కేవలం హీరోగానే కాకుండా నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నారు. ఆయన కెరీర్‌లో నిర్మాతగా ప్రారంభించిన తొలి ప్రాజెక్ట్ 'దూత 2' కావడం విశేషం. దీంతో ఈ సిరీస్‌పై చైతన్య ప్రత్యేక శ్రద్ధ పెట్టుతున్నట్లు సమాచారం.

PUBLISHED AND OWNER BY AVANAGANTI ANIL KUMAR Published at 3-83/A, BADANGPET, BALAPUR, RANGAREDDY District TELANGANA - 500058. Printed at SMILYSONLINE 6-7-48, VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY District, TELANGANA - 500070. EDITOR AVANAGANTI ANIL KUMAR PRGI NO. : TGTEL/26/A2290 , CELL : 9133444314